PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 51 | విజయవాడ, గురువారం 21 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 21 September 2023 | Rs

నేటి నుంచి అసెంబ్లీ

- ఇవే చివరి సమావేశాలు?
- 21 బిల్లులు పెట్టే అవకాశం
- నేడు బిఎసిలో నిర్ణయం

2

అక్కినేని @ 100



తెలుగువారి దసరాబుల్లోడుగా చిరస్మరణీయ కీర్తి నొందిన నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలను తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో అక్కినేని కుటుంబ సభ్యులు ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి అక్కినేని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అక్కినేనికి ఘనంగా నివాళులర్పించారు.

6

మహిళా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అనుకూలం : 454

వ్యతిరేకం : ఇద్దరు

- తక్షణమే అమలు చేయాలి
- ఒబిసిలను విస్మరించారు
- చర్చలో విపక్షాలు
- సవరించుకోవచ్చు... ఆమోదించండి : అమిత్ షా
- నేడు రాజ్యసభ ముందుకు



న్యూఢిల్లీ: మహిళా బిల్లుకు లోక్‌సభలో ఎట్టకేలకు ఆమోదం లభించింది. దీంతో నూతన పార్లమెంటు భవనంలో ఆమోదం పొందిన మొదటి బిల్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లు నిలిచింది. చట్ట సభల్లో మహిళలకు 33శాతం సీట్లను రిజర్వుచేయడానికి ఉద్దేశించిన ఈ బిల్లుపై ఎనిమిది గంటల పాటు చర్చ జరిగింది. చర్చ సందర్భంగా ఎన్నికల ప్రయోజనాలకోసమే బిజెపి ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువస్తోందని, చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే రిజర్వేషన్ల అమలయ్యేలా బిల్లును రూపొందించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఓబిసిలను విస్మరించడంపైనా విమర్శలు కుప్పించాయి. చర్చకు ముగింపుగా మాట్లాడిన హోంమంత్రి అమిత్‌షా ప్రతిపక్షాల విమర్శలను తోసిపుచ్చారు. ఓబిసిలతో పాటు ఇతర అంశాలేవైనా విస్మరణకు గురైనట్టు భావిస్తే ఎప్పుడైనా సవరించుకోవచ్చని చెప్పారు. బిల్లును ఆమోదించాలని కోరారు. చర్చలో 27 మంది మహిళా ఎంపిలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఓటింగ్‌లో 454 మంది బిల్లుకు అనుకూలంగా అనుకూలంగా.. ఇద్దరు వ్యతిరేకంగా ఓటేశారు. మాన్యువల్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. రాజ్యాంగ సవరణ కూడా ఉండటంతో మాన్యువల్ పద్ధతి అనుసరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, నూతన పార్లమెంటు భవనంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం విఫలమైందన్న వార్తలు కూడా వచ్చాయి. ఎరుపు, ఆకుపచ్చ స్లిప్పులను సభ్యులందరికీ అందజేశారు.ఓటింగ్ ప్రక్రియపై లోకసభ సెక్రటరీ జనరల్ వారికి వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపినట్లయితే 'ఎస్' అని ఆకుపచ్చ స్లిప్పుపై రాయాలి. వ్యతిరేకిస్తే ఎరుపు స్లిప్పుపై 'నో' అని రాయాలని చెప్పారు. ఓటింగ్‌కు కొద్దిసేపు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభలోకి వచ్చారు. లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.

తక్షణమే అమలులోకి : సోనియాగాంధీ

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలులోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ డిమాండ్ చేశారు. బిల్లుపై చర్చను బుధవారం నాడు లోక్‌సభలో ఆమె ప్రారంభించారు. ఎట్టకేలకు మహిళా రిజర్వేషన్‌బిల్లును ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేసిన సోనియా అదే సమయంలో 2024 ఎన్నికలకు దీనిని వర్తింపచేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇంకా ఎంత కాలం ఎదురుచూడాలి?' అని ఆమె ప్రశ్నించారు. 'ఈ బిల్లు ఆమోదం పొందాలని మేం కోరుకుంటున్నాం. అదే సమయంలో కొంత ఆందోళన కూడా ఉంది. మహిళలు 13 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. మీరు ఇంకా ఎదురుచూడమంటున్నారు. ఇలా ఎంతకాలం? తక్షణమే బిల్లును అమలులోకి తీసుకురావాలి. ఆలస్యమైతే అన్యాయం జరుగుతుంది. మొత్తం ఒకే కోటా అంటున్నారు. కానీ, ఎస్‌సి,ఎస్‌టి, ఓబిసి మహిళలకు సబ్ కోటా ఏర్పాటు చేయాలి. అప్పుడే వారికి పూర్తి న్యాయం జరుగుతుంది. దీనికోసం అవసరమైతే వెంటనే కుల గణన జరపాలి.' అని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు రాజీవ్‌గాంధీ స్వప్నమని చెప్పారు. అందువల్లే తనకు ఉద్విగ్నభరితంగా ఉందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజీవ్‌గాంధీ రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టారని, అప్పుడది ఏడు ఓట్ల తేడాతో వీగిపోయిందన్నారు. ఆ తరువాత పివి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో మరోసారి ఆ బిల్లును ప్రవేశపెట్టి, మిగతా 5లో

జాగ్రత్తగా ఉండండి

- కెనడాలోని భారత పౌరులకు కేంద్రం సలహా

న్యూఢిల్లీ: భారత్-కెనడా దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరు దేశాలు తమ పౌరులు జాగ్రత్తగా ఉండాలని సలహాలు జారీ చేశాయి. కెనడాలోని భారత పౌరులు, విద్యార్థులు, అక్కడకు ప్రయాణించాలనుకునేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని బుధవారం భారత ప్రభుత్వం తన పౌరులను హెచ్చరించింది. భారత్‌లో ఉంటున్న కెనడా పౌరులు జాగ్రత్తగా ఉండాలని ట్రూడో ప్రభుత్వం సలహా జారీ చేసిన కొన్ని గంటల్లోనే కేంద్రం ఈ ప్రకటన విడుదల చేసింది. 'కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, రాజకీయ అండతో జరుగుతున్న విద్వేషపూరిత నేరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు తమ ప్రయాణాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఇండియా వ్యతిరేక ఎజెండాను వ్యతిరేకిస్తున్న భారత ప్రజలను, మన దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల కాలంలో బెదిరింపులు వస్తున్నాయి. అందువల్ల అలాంటి హింసాత్మక ఘటనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లొద్దని కోరుతున్నాం' అని కేంద్ర విదేశాంగ శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. 'కెనడాలోని భారత పౌరులను సంరక్షించేందుకు అక్కడి అధికారులతో భారత హైకమిషన్/కాన్సులేట్ జనరల్ నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాయి. అయినా.. ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా భారత పౌరులు, ముఖ్యంగా విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలి. కెనడాలోని భారత పౌరులు ఒట్టావాలోని హైకమిషన్ లేదా టొరంటో, వాంకోవర్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా వద్ద తమ పేర్లను నమోదు చేసుకోండి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు మిమ్మల్ని వేగంగా సంప్రదించేందుకు వీలవుతుంది' అని తెలిపింది.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం తదితరులు

ఎన్నికలకు 'ఉక్కు' అజెండా

- అన్ని పార్టీలప్రణాళికలో పెట్టాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పిలుపు
- విశాఖలో ఉక్కు రక్షణ బైకు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అజెండాతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు 2024 ఎన్నికలకు రావాలని, అలా చేయని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాకతప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడిసరుకు రాకుండా ఉత్పత్తిని అడ్డుకుంటోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించం అని బిజెపి ప్రకటన చేయకుంటే వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ నాయకులను విశాఖలో ప్రజానీకం తిరగనివ్వదని హెచ్చరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన ఉక్కు రక్షణ బైకు యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ నెల 29 వరకూ ఉత్తరాంధ్రలో సాగే ఈ బైకు యాత్రకు సంబంధించి అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. 'ఉక్కు మాదే-హక్కు మాదే' అని రెండేళ్లుగా కార్మికులు పట్టువిడవకుండా పోరాడుతుండడాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు స్టీల్‌ప్లాంట్‌కు మా మద్దతు అంటూ ఉపన్యాసాలిస్తున్నాయి మినహా బిజెపికి వ్యతిరేకంగా పోరాటాల్లోకి రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ప్రధాన అజెండా ఉక్కు పరిరక్షణ కానుందని తెలిపారు. కార్మిక సంఘాలన్నీ 950 రోజులకు పైబడి పోరాడుతుండడంతో కేంద్రం తన స్ట్రాటజిక్ సేల్ నుంచి ఒక్క అడుగూ ముందుకేయలేకపోయిందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ఎండగట్టేసి భూములను అదానీ, అంబానీ, జిందాల్ మిగతా 5లో

స్కిల్ కేసులో సిఐడి కస్టడీపై నేడు తీర్పు

- ఎసిబి కోర్టులో ముగిసిన వాదనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో భాగంగా రిమాండ్‌లో వున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఎసిబి కోర్టులో సిఐడి వేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిశాయి. సిఐడి తరపు న్యాయవాదులు, చంద్రబాబు తరపు వాదనలను విన్న ఎసిబి కోర్టు తీర్పును గురువారానికి వాయిదా వేసింది. చంద్రబాబును ఐదురోజులు సిఐడి కస్టడీకి ఇవ్వాలని సిఐడి తరపున అడిషనల్ అటార్నీ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. చంద్రబాబును అన్ని ఆధారాలతోనే అరెస్టు చేశారన్నారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న ప్రతిఒక్కరినీ మరింత విచారించాల్సి వుందన్నారు. ఈ కేసులో కుట్ర కోణాన్ని వెలికితీసేందుకు చంద్రబాబును పూర్తి స్థాయిలో విచారించాల్సి వుందన్నారు. నిధులు ఎక్కడ నుండి ఎక్కడికి వెళ్లాయో సమాచారం వుందని, కేసుకు సంబంధించి పూర్తి వివరాలు రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. చంద్రబాబును కోర్టులో హాజరుపరిచిన సెప్టెంబరు 10న సిఐడి కస్టడీ కోరకుండా మరుసటి రోజు 11న కస్టడీ కోరుతూ పిటిషన్ ఎలా వేస్తుందన్నారు. చంద్రబాబు అరెస్టు ప్రక్రియంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నారు. చంద్రబాబును అరెస్టు చేశాక విచారణ పేరుతో సిఐడి ఆఫీసులో వుంచారని తెలిపారు. కొన్ని గంటలపాటు విచారించి అన్ని విషయాలూ రాబట్టామని చెప్పి మళ్లీ ఇప్పుడు కస్టడీకి ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. 10న కోర్టులో ప్రవేశపెట్టాక 24 గంటల్లో దర్యాప్తు అధికారి నిర్ణయం మార్చుకున్నారని తెలిపారు. పాత అంశాలతో కస్టడీకి ఎలా కోరతారని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు ఎక్కడా ఆధారాల్లేవని, నాలుగేళ్లుగా ఎవరిని అరెస్టు చేసినా నిధుల దుర్వినియోగం పేరు చెబుతున్నారని పేర్కొన్నారు. దర్యాప్తు విషయాలపై సిఐడి మీడియా సమావేశాలు ఎలా పెడుతుందని ప్రశ్నించారు. ఇరువైపులా వాదనలు విన్న ఎసిబి కోర్టు జడ్జి తీర్పును గురువారానికి వాయిదా వేశారు.

ఒపిఎస్ కాదు జిపిఎస్

- క్యాబినెట్ ఆమోదం
- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అసైన్డ్ చట్టసవరణకు బిల్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెన్షన్ స్కీమ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంలో ఏమాత్రం మార్పు రాలేదు. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలు చేయాలన్న ఉద్యోగుల విజ్ఞప్తులను బేఖాతరు చేసింది. ఎన్నికల హామీని సైతం విస్మరించి గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్)కు ఆమోద ముద్ర వేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రిమండలి ఈ మేరకు రూపొందించిన బిల్లును ఆమోదించింది. నేటి (గురువారం) నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును ఈ సమావేశాల్లోనే సభలో ప్రవేశపెట్టనున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న ఇళ్లకోసం అదనంగా 70 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలలో 50 శాతం సీట్లు ఎస్‌టి విద్యార్థులకు కేటాయించాలన్న ప్రతిపాదనకూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వీటితో పాటు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు. సమాచారశాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎపి కాంట్రాక్టు ఎంప్లాయీస్ బిల్ 2023ను మంత్రిమండలి ఆమోదించిందని, దీని వల్ల 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులు 21,748 మంది క్రమబద్ధీకరణ అవుతారని తెలిపారు. వేర్వేరు విభాగాల్లో 10,115 మంది, ఎపివివిపిలో 11,633 మందికి లబ్ధికలగనుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులందరికి జిపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగ విరమణ సమయానికి ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లస్థలం కూడా ఉండటం లేదని, వారికి ఇళ్ల స్థలం ఉండేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అలాగే వారి పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చూడాలనీ మంత్రిమండలి నిర్ణయించింది. వీటికి సంబంధించిన బిల్లులనూ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. క్యాన్సర్ రోగులకు మరింత మెరుగైన చికిత్సలు అందించే చర్యల్లో భాగంగా విశాఖ కెజిహెచ్, గుంటూరు జిజిహెచ్, కడప జిజిహెచ్‌లో క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో 353 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే 50 వేలమందిని వైద్య రంగంలో నియమించారని తెలిపారు. గ్రామీణ ప్రజలకూ వైద్యం చేరువ చేసే ప్రక్రియలో భాగంగా 53 వేలమందిని నియమించారని తెలిపారు. ఇక ముందు వేకేన్సీ ఉంటే వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకునేందుకు మంత్రిమండలి ఆమోదం మిగతా 2లో

వరి సాగు సున్నా!



సాగుకు నోచని ఆయకట్టు భూములు

- కెసి కెనాల్ ఆయకట్టులో పడని నాట్లు
- రైతుల ఆశలు ఆవిరి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

సాగు నీరు విడుదల కాకపోవడం, తీవ్ర వర్షాభావం, అధికారుల ప్రకటనతో కడప జిల్లా పరిధిలోని కర్నూలు-కడప కెనాల్ (కెసి) ఆయకట్టు పరిధిలోని వరి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఖరీఫ్‌లో ఒక్క ఎకరంలోనూ వరి సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదు. సెప్టెంబర్ మూడవ పూర్తి కావస్తున్నా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగకపోవడం, కర్ణాటకలో తుంగభద్ర కెనాల్‌కు గండి పడడంతో ఆయకట్టు భూముల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది ఆగస్టు 16న సాగు నీరు విడుదల కావాల్సి ఉంది. నారుమడులు వేసుకొని సాగుకు సిద్ధంగా ఉన్న రైతులు నీరు విడుదల కాదని తెలిసి తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. శ్రీశైలం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 91 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దీంతో, ఈ ఖరీఫ్‌లో వరికి సాగు నీరు ఇవ్వలేమని అధికారులు చేతులెత్తేశారు. నీటి వనరులున్న చోట్ల ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. కెసి కెనాల్ పరిధిలో కడప, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. ఇందులో కడప జిల్లాలో 92 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దాదాపు 65 వేల నుంచి 80 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేస్తుంటారు. గత ఏడాది ఈ సమయానికి 62 వేల ఎకరాల్లో వరి సాగులో ఉంది. రైతులు ప్రస్తుతం ఆరు వేల ఎకరాలకు సరిపడగా వరి నారు మడులు వేశారు. సాగు నీరులేక ఒక్క ఎకరంలోనూ వరి నాట్లు వేయలేదు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అధికారులు ఈ నెల 15న చేసిన ప్రకటనతో వరి సాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. వరికి సాగు నీరు ఇచ్చేది లేదని అధికారులు చెప్పడమే కాకుండా సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మాత్రమే పండించుకోవాలని సూచించారు. అయితే, ఇందుకు సంబంధించిన విత్తనాలు ఆర్‌బికెల్లో అందుబాటులో లేవని రైతులు చెప్తున్నారు. కెసి ఆయకట్టు శివారు ప్రాంతాల్లో ఖరీఫ్‌లో పసుపు, మిరప, కూరగాయల పంటలు కూడా పండిస్తుంటారు. గత ఏడాది మూడు వేల ఎకరాల్లో పసుపు సాగైంది. ఈ ఏడాది ప్రస్తుతం 1,600 ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగులో ఉంది. ప్రస్తుతం పసుపు సాగుకు కూడా సమయం మించిపోవడంతో కూరగాయల పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాయక్ సూచించారు. దీంతో, ఖరీఫ్‌లో సాగు విరమించి రబీలోనే పంటలు సాగు చేసే ఉద్దేశంతో ఉన్నామని ఆయకట్టు రైతులు కొందరు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

విత్తన పంపిణీకి అనుమతి రావాలి

కెసి ఆయకట్టు పరిధిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాల పంపిణీ కోసం అనుమతి రావాల్సి ఉంది. ఈలోపు ఆర్‌బికెల వారీగా విత్తన పొజిషనింగ్ చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది.

- అయితా నాగేశ్వరరావు, డిఎఒ, కడప

వరి నాట్లు వేయలేకపోయాను



కెసి కెనాల్‌కు సకాలంలో నీరు వస్తుందని ఆశించి వరి నారు వేశాను. కాలువకు నీరు విడుదల కాకపోవడంతో నాట్లు వేయడానికి అవకాశం లేకుండా పోయింది. నారు ముదిరిపోయింది. ప్రభుత్వం ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేసి విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలి.

-ప్రసాద్, సిద్ధారెడ్డిపల్లి గ్రామ రైతు

పాలమూరుపై పిటిషన్ తిరస్కరణ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కృష్ణా ట్రిబ్యునల్ తిరస్కరించింది. దీనిపై విచారించే అధికారం తమకు లేదంటూ సంబంధిత వేదికలను ఆశ్రయించాలని సూచించింది.

పాలమూరు ప్రాజెక్టుకు 90 టిఎంసిల నీటిని కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం గతంలో జిఒ 246 జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌లో ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌ను దాఖలు చేసింది. దీనిపై ట్రిబ్యునల్ బుధవారం విచారించింది.

ఈ పిటిషన్‌ను విచారించే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది. ఇందుకు తగిన వేదికలను ఆశ్రయించాలని ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్ కుమార్, సభ్యులు జస్టిస్ ఎస్ తలపాత్ర, జస్టిస్ రామ్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తూ కేసును కొట్టివేశారు.

చంద్రబాబు అరెస్టుపై నిలదీస్తాం

ప్రభుత్వ దుర్మార్గాలు, దోపిడీని అసెంబ్లీలో ఎండగడతాం

టిడిఎల్‌పి నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుపై అసెంబ్లీలో గళమెత్తాలని ఆ పార్టీ శాసనసభాపక్ష సమావేశం (టిడిఎల్‌పి) నిర్ణయం తీసుకుంది. సమావేశాలు జరగనున్న ఐదురోజులు చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలనే డిమాండే ప్రధాన అజెండాగా టిడిపి వ్యవహరించనుంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ, శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఆధ్వర్యంలో టిడిఎల్‌పి సమావేశం బుధవారం జరిగింది. టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి లోకేష్, బాలకృష్ణ తదితరులు ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణను ప్రభుత్వం అపహాస్యంగా మార్చిందని సమావేశం అనంతరం ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఎమ్మెల్యేలు డోలా వీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు అన్నారు. చంద్రబాబుపై ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు, వాటివెనకున్న కుట్రలను బయటపెట్టి అసెంబ్లీ సాక్షిగా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఏకాభిప్రాయానికి వచ్చామని చెప్పారు. పాలకులు పెట్టిన అక్రమ కేసులు ముమ్మాటికీ రాజకీయ ప్రేరేపితాలేనని ప్రజలకు తెలియజేస్తామన్నారు. జగన్ ఇసుక దోపిడీ, లిక్కర్ మాఫియా, భూకుంభ కోణాలు, ఖనిజాల దోపిడీతో పాటు, దళితులు, బిసిలు, మైనార్టీలు, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అఘాయిత్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

ప్రతిపక్షాన్ని, నేతలను అంతం చేయాలన్న దుర్మార్గపు ఆలోచనలతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహించారు. 38 కేసుల్లో నిందితుడిగా, 158 స్టేలు తెచ్చుకున్న జగన్ నీతి, నిజాయతీలకు మారు పేరైన చంద్రబాబును అన్యాయంగా జైలుకు పంపారని విమర్శించారు. వైసిపి పాలనతో నష్టపోయిన అన్ని వర్గాల సమస్యలనూ చట్టసభల్లో ప్రస్తావిస్తామన్నారు. ప్రజాగళం అసెంబ్లీలో వినిపించకుండా ప్రతిపక్ష సభ్యుల్ని అడ్డుకుంటున్న పాలకపక్ష తీరును నిలువరిస్తూ గట్టిగా పోరాడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సంఖ్యాబలంలో తక్కువైనా ప్రజాబలంలో తమదే పైచేయి అని పేర్కొన్నారు.

ఆస్పత్రి నుంచి గవర్నరు డిశ్చార్జి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ మేరకు ఆస్పత్రి డైరెక్టరు సుధాకర్ కంటిపూడి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18న పొత్తికడుపు నొప్పితో మణిపాల్ ఆస్పత్రిలో గవర్నరు చేరడం, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అదేరోజు రోబోటిక్ అపెండెక్టమీని వైద్యులు చేసిన సంగతి తెలిసిందే.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సర్వే మెయిన్‌టెన్స్ టెస్ట్ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఎస్‌టిఎ ట్రైనింగ్స్, ఎగ్జామినేషన్స్‌కు సంబంధించిన సర్వే మెయిన్‌టెన్స్ పరీక్ష ఈ నెల 24న జరగాల్సి ఉండగా, పరీక్షను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనరు సిద్ధార్థజైన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలపనున్నట్లు పేర్కొన్నారు.

సహకార పోస్టుల మంజూరు పట్ల హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకారశాఖలో కొత్తగా 13 స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ (డిసిఒ), 6 డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎపి కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టివి ఫణి ఫేరాజు, కెబి రుషి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పాటుచేసిన జిల్లాల్లో పోస్టుల కొరతతో ఏర్పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత 30 ఏళ్లుగా నియామకాలు జరగని జూనియర్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థానాలను అడహాక్ ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తహశీల్దారుపై దాడికి ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు తహశీల్దారు లక్ష్మీనారాయణరెడ్డిపై దాడిని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్ భాస్కర్ రెడ్డికి 12 రోజుల ఎస్కార్ట్ బెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు వైఎస్ భాస్కర్ రెడ్డికి 12 రోజుల ఎస్కార్ట్ బెయిల్ మంజూరైంది. అనారోగ్య కారణాల రీత్యా 15 రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సిబిఐ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు ప్రకటించారు. భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై రెండ్రోజుల క్రితమే వాదనలు పూర్తయ్యాయి. భాస్కర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై చంచల్‌గూడ జైలు అధికారులు న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దానిని పరిశీలించిన సిబిఐ కోర్టు భాస్కర్‌రెడ్డికి 12 రోజుల ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం తీర్పు ప్రకటించింది.

విపత్తులపై అప్రమత్తం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విపత్తులు వచ్చినపుడు అన్ని శాఖలు అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. బుధవారం ప్రొబేషన్ ఐపిఎస్ అధికారి పంకజ్‌కుమార్ రాష్ట్ర విపత్తుల నిర్వహణపై అవగాహన కోసం తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి అంబేద్కర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో విపత్తుల నిర్వహణను వివరించారు. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ కేంద్రంలో 24 గంటలు వాతావరణాన్ని పర్యవేక్షించే విధానం వుంటుందని తెలిపారు. తుపానులు, వరదలు, వడగాడ్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు వంటి విపత్తులను జిల్లా యంత్రాంగానికి ఎప్పటికప్పుడు పంపిస్తూ అప్రమత్తంగా వుంచాల్సి వుంటుందన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ మొత్తం దెబ్బతిన్నపుడు శాటిలైట్ ఫోన్, వాకీటాకీలను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సి నాగరాజు, ఎంఎం ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు 'కత్తెర'

- వర్షాభావంతో పొట్ట దశలో ఆశించిన పురుగు
- తెగుళ్ల వ్యాప్తితో కొన్ని ప్రాంతాల్లో ఎండిపోయిన పంట



లావేరులో మొక్కజొన్న పంటను తొలిచేస్తున్న పురుగు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సిక్కోలును తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. జిల్లాలో తగినంతగా వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో రైతులు పంటలు వేయలేకపోయారు. మరోవైపు వేసిన పంటలూ ఎండిపోవడమో, తెగుళ్లు ఆశించడమో జరుగుతోంది. ముఖ్యంగా మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న పంటకు ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించింది. కొన్నిచోట్ల పాముపొడ పురుగూ మొక్కను తినేస్తోంది. పురుగు వ్యాప్తి ఉధృతంగా ఉండడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 26,375 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట వేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసింది. వర్షాభావ పరిస్థితుల వల్ల 23,593 ఎకరాల్లోనే పంట వేశారు. ప్రధానంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం ఆమదాలవలస మండలంలోని పొందూరు ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగవుతోంది. మరికొద్ది రోజుల్లో పంట చేతికొస్తున్న తరుణంలో కత్తెర పురుగు ఆశించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మోటార్ల సాయంతో పంటను కాపాడుకున్న రైతులకు ఇప్పుడు కత్తెర పురుగు రూపంలో నష్టం వాటిల్లుతోంది. ఈ పురుగులు సాధారణంగా కంకి పైభాగాన్ని తింటాయి. ప్రస్తుతం మధ్యలో నుంచి వెళ్తూ కంకిని తినేస్తున్నాయని రైతులు చెప్తున్నారు కత్తెర పురుగు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కత్తెర పురుగుతో ఎంతమేర విస్తీర్ణంలో దెబ్బతిందో ఇప్పుడే అంచనా వేయలేమని, దిగుబడి మాత్రం తగ్గుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. సాధారణంగా ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెప్తుండగా, ఈ ఏడాది కొంతమేర దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో పాముపొడ పురుగు ఆశించడంతో పంట అంతా ఎండిపోయింది. జి.సిగడాం మండలం గోకర్ణపల్లిలో సుమారు 150 ఎకరాల్లో పంట పోయినట్లు రైతులు చెప్తున్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రతిచోటా మొక్కజొన్న పంటకు ఈ రకమైన తెగుళ్ల ప్రభావం ఉంటుందని వారు అంటున్నారు.

సాగునీరు లేక మొక్కజొన్న వైపు మొగ్గు

మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉండడంతో ఈ ఏడాది రైతులు ఆ పంట వైపు మొగ్గు చూపారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లోని వారు, కాలువల ద్వారా సాగునీరు అందుతుందనే నమ్మకం లేని వారు మొక్కజొన్న పంట సాగు చేపట్టారు. ప్రధానంగా మడ్డువలస, నారాయణపురం ప్రాంతాల రైతులు ఎక్కువ మంది వరి నుంచి మొక్కజొన్న పంట వైపు మళ్లారు. ఇప్పుడు మొక్కజొన్న పంట కూడా దెబ్బతినడంతో ఏం చేయాలో వారికి పాలుపోవడం లేదు.

సగం పంట పోయింది

నేను ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న వేశాను. వర్షాలు లేకపోవడంతో మోటార్ల సాయంతో నీళ్లు పెట్టాం. పంట బాగా ఉందనుకున్న సమయానికి పురుగు పట్టింది. మొత్తం పంటనంతటినీ పురుగు ఆశించింది. సగానికిపైగా పంట పోయింది. సాగు ఖర్చుల కోసం రూ.60 వేలు వరకు అప్పు చేశాను. కనీసం అప్పు అయినా తీరుతుందో, లేదోనని బెంగగా ఉంది.

- ఎస్.చిరంజీవులు, రంగనాథపేట, పొందూరు మండలం

సాగునీరు లేదని మొక్కజొన్న వేశాను

మడ్డువలస, నారాయణపురం కాలువలు మా ప్రాంతం వరకు వస్తున్నా ప్రతి ఏడాది నీరు రావడం లేదు. వర్షాలూ లేకపోవడంతో ఎకరా పొలంలో మొక్కజొన్న వేశాను. వర్షాల్లేక మొక్కజొన్న పంటకు పురుగు పట్టింది. పురుగుమందులు కొడుతున్నా పనిచేయడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

- పి.నారాయణరావు, గోకర్ణపల్లి, పొందూరు మండలం

ఎంబిబిఎస్ కౌన్సెలింగ్‌లో అవకతవకలు

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడుగు, బలహీనవర్గాల పట్ల వైసిపి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న విషయం మరోసారి రుజువైందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో విడత ఎంబిబిఎస్ కౌన్సెలింగ్ మొత్తం అవకతవకలుగా జరిగిందన్నారు. దీనిపై 21న జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై సిఎంకు బహిరంగ లేఖ రాయనున్నట్లు గిడుగు పేర్కొన్నారు. ఈ నెల 22న వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్‌ను, రిజిస్ట్రార్‌ను కలిసి తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా ఇవ్వడంతోపాటు న్యాయ పోరాటం కూడా చేస్తామన్నారు. ప్రతిభగల విద్యార్థులకు ఓపెన్ కేటగిరి కింద సీట్లు కేటాయించకుండా రిజర్వుడ్ సీట్లు కేటాయిస్తూ బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 53 వేల ర్యాంకు విద్యార్థికి రిజర్వు సీటు, 60 వేల ర్యాంకరుకు ఓపెన్ కేటగిరిలో సీటు ఇచ్చారన్నారు. మహిళా బిల్లులోనూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సినీ నటుడు రాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, ఎఐసిసి సభ్యులు కొలనుకొండ శివాజి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

- నేటి నుంచి ప్రచార యాత్రలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. 1974లో యుటిఎఫ్ స్థాపించటం జరిగిందన్నారు. 50 ఏళ్ల సందర్భంగా గురువారం నుంచి రెండు ప్రచార యాత్రలు రాష్ట్రంలో జరగనున్నాయని తెలిపారు. స్వర్ణోత్సవాలకు సంబంధించిన ప్రచార యాత్ర పోస్టరును విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు కెఎస్ఎస్ ప్రసాద్ నాయకత్వంలో ఒక యాత్ర, అనంతపురం జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకు అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మరో యాత్ర ప్రారంభం కానున్నాయని తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ఈ రెండు జాతాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన చేస్తాయని చెప్పారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి మేధావులతో చర్చించి చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారనున్న జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు అందుకోలేని పరిస్థితిని వెంటనే తొలగించాలన్నారు. ఈ యాత్రల్లో ఉపాధ్యాయులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి బి లక్ష్మిరాజా, ప్రచురణాల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రావణాసురుడి పాలన : అయ్యన్న

- గన్నవరంలో సభలో సిఎంపై అనుచిత వ్యాఖ్యలపై పోలీసు విచారణ

ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్

రాష్ట్రంలో ప్రస్తుతం రావణాసురుడి పాలన సాగుతోందని, ఆ పరిపాలనలో భాగంగానే ప్రతిపక్షాలపై, ప్రజలపై నిత్యం వేధింపులు పెరిగిపోతున్నాయని టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా కృష్ణాజిల్లా గన్నవరంలో నిర్వహించిన బహిరంగ సభలో సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి పేర్ని నాని ఫిర్యాదు చేశారు. దీంతో అయ్యన్నపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుకు సంబంధించి ఆయనను గతంలో హనుమాన్ జంక్షన్ పోలీసులు విశాఖపట్నం విమానాశ్రయంలో అరెస్టు చేసి మార్గమధ్యంలో 41 ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఆ నోటీసుకు సంబంధించి తన వాదన వినిపించేందుకు అయ్యన్నపాత్రుడుతోపాటు టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణరావు కలిసి హనుమాన్ జంక్షన్ సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. వారిని జంక్షన్ సిఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ శ్రీనివాసరావు, గన్నవరం డిఎస్‌పి జయసింహా వేర్వేరుగా విచారించారు. దాదాపు రెండు గంటలపాటు విచారణ సాగింది. రాష్ట్ర ప్రజలు అనుకుంటున్న మాటలను ప్రతిపక్ష నేత హోదాలో గన్నవరం బహిరంగ సభలో తాను మాట్లాడినట్లు అయ్యన్నపాత్రుడు పోలీసులకు స్పష్టం చేశారు. అయ్యన్నపాత్రుడు చెప్పిన వివరణను కోర్టుకు నివేదిస్తామని జంక్షన్ సిఐ తెలిపారు.

అనంతరం అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ ప్రజల హక్కులను కాలరాయటమే జగన్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశంగా ఉందని విమర్శించారు. తప్పులను ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతలపైన, ప్రజలపైన, సహకరించని అధికారులపైన కేసులు పెట్టడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రతిపక్ష నేతలను దూర్భాషలాడుతూ కేసులు పెట్టి ఆనందం పొందుతున్న వైసిపి నేతలకు రివర్స్ ట్రీట్‌మెంట్ ఉంటుందని హెచ్చరించారు.

చంద్రబాబు ముందస్తు బెయిల్ కేసుపై విచారణ 22కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

నీటిపారుదల ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం పర్యటన సందర్భంగా జరిగిన గొడవల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది. తనపై ముదివేడు పోలీసులు కేసు (79/2023) నమోదు చేశారని, ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె సురేష్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. పోలీసుల అనుమతితో చేసిన ర్యాలీ అంగళ్లు కూడలికి చేరుకున్నాక అధికార పార్టీ వారు తన కాన్వాయిపై రాళ్లు విసిరి గొడవ చేశారని, అయితే, తనపైనే తప్పుడు ఫిర్యాదు చేస్తే దానిని పోలీసులు నమోదు చేశారని ఆయన తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల అదనపు ఎజి విచారణకు హాజరుకాలేదు. దీంతో విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది.

సుస్థిరమైన ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి

- మెప్మా డైరెక్టరు విజయలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుస్థిరమైన ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మెప్మా పనిచేస్తుందని మెప్మా మిషన్ డైరెక్టరు వి విజయలక్ష్మి పేర్కొన్నారు. మెప్మా సంస్థ జగనన్న మహిళా మార్టులు, జగన్ ఇ -మార్టులు, అర్బన్ మార్కెట్, మహిళా ప్రగతి యూనిట్లను ఏర్పాటు చేస్తుందన్నారు. తాడేపల్లిలోని కెఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం రాష్ట్ర వ్యాప్త పట్టణ సమాఖ్య పదాధికారులు, ఆర్‌పిల ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోని 175 పట్టణ సమాఖ్యల నుంచి 700 మంది పట్టణ సమాఖ్య పదాధికారులు, ఆర్‌పిలు, ఎస్ఎమ్ఎమ్‌లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఒంగోలు, ఏలూరు, విజయవాడలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో 168 పోస్టులు, 11 ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్యకళాశాలల్లో 99 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష మీద వైద్య రంగంలో ఉన్న అన్ని స్థాయిల సిబ్బంది అవగాహన కల్పిస్తారని తెలిపారు. దీని కింద నిర్వహించే పరీక్షలన్నీ ఉచితంగానే చేస్తారని, మందులూ ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు యూనివర్శిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ మరియు రెగ్యులేషన్ చట్టం 2016 చట్ట సవరణ బిల్లును మంత్రిమండలి ఆమోదించింది. ప్రైవేటు యూనివర్శిటీలు కొత్తగా ఏర్పాటు చేస్తే వచ్చే అదనపు సీట్లలో 35 శాతం కన్వీనర్ కోటాలోకి వస్తాయని మంత్రి తెలిపారు. కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలలో 50 శాతం సీట్లు ఎస్‌టి విద్యార్థులకు కేటాయించేలా ప్రతిపాదనలను ఆమోదించారు ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసే విధంగా ఎపి లెజిస్లేచర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆధార్ చట్టంపై బిల్లు తెచ్చేందుకు మంత్రిమండలి ఆమోదించింది. వ్యక్తుల గుర్తింపు కోసం అధార్ వినియోగంపై చట్టబద్ధత తేవాలనేది దీని ఉద్దేశమని మంత్రి తెలిపారు.

యుపిఎస్‌సిలో ఉత్తీర్ణులకు ఆర్థిక సాయం

ఎపిలో యుపిఎస్‌సిలో నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎస్‌సి, బిసి, ఎస్‌టి విద్యార్థులకు ఆర్థిక సాయం కోసం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం పేరుతో అవార్డు ఇవ్వాలని నిర్ణయించారు. దీనికోసం ప్రిలిమ్స్‌లో సెలక్టయిన వారికి లక్ష, మెయిన్స్‌కు రూ.50 వేలు సాయం ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యాశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలు అందుబాటులోకి తేవాలని మంత్రి మండలి నిర్ణయించింది, ఇంటర్నేషనల్ బకలారియట్ సిలబస్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. . మొదటి తరగతి నుండి ప్రారంభించి తరువాత అన్ని తరగతులకు విస్తరించనున్నారు. దీనికి ఎంఓయు కూడా చేసుకున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా కమ్యూనికేషన్ గ్యాప్ అనేది లేకుండా ఉంటుందని తెలిపారు.

ఒపిఎస్ కాదు జిపిఎస్

పలుశాఖల్లో పోస్టుల భర్తీకి ఆమోదముద్ర

. ఇకముందు యూనివర్శిటీల్లో నియామకాలు ఎపిపిఎస్‌సి ద్వారానే జరగాలని నిర్ణయించారు. ఆదోనీ వైద్యకళాశాలలో, 13 స్పెషల్ డిప్యూటీ, ఆరు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఎపి హైకోర్టులో 40 ఆఫీసు సబార్డినేట్ పోస్టులు 28 డ్రైవర్ పోస్టులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు ఆమెదం తెలిపారు.

ఎపి మోటార్ వెహికల్ చట్టం 1963 చట్ట సవరణనూ, అసైన్డ్ ల్యాండ్ చట్టం 1977కు సవరణ చేస్తూ తీసుకున్న నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

విశాఖ పాలనా కేంద్రంపై చర్చ జరగలేదు

విశాఖలో దసరా నుండి పరిపాలనా కేంద్రం ఏర్పాటు చేస్తారన్న ప్రచారాన్ని మంత్రి కొట్టి పారేశారు. అసలు అటువంటి చర్చ జరగలేదన్నారు. విశాఖకు ఎప్పుడు వెళ్లాలనేది ముఖ్యమంత్రి చెబుతారని అన్నారు. దీనిపై ప్రత్యేకంగా చర్చ జరగాల్సిన అవసరం కూడా లేదని పేర్కొన్నారు.

చంద్రబాబు అవినీతి నిరూపితం అయింది

చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని, దీనికి సంబంధించిన అనేక అధారాలను అధికారులు సేకరించారని మంత్రి తెలిపారు. చంద్రబాబు అరెస్టుపై క్యాబినెట్లో చర్చ జరిగిందా అని విలేకరులు ప్రశ్నించగా అటువంటిదేమీ లేదని, అయినా ఆయన ఇప్పటికే జైల్లో ఉన్నాడని, ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదని తెలిపారు.

దేనికైనా సిద్ధంగా ఉండాలి : జమిలి పై సిఎం

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం జమిలి ఎన్నికలు కేంద్రంగా కొద్దిరోజులగా వస్తున్న వార్తలపై మంత్రిమండలిలో చర్చ జరిగింది. మంత్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే, ఈ విషయంలో తొందరపడి మాట్లాడటం కన్నా కేంద్రం నిర్ణయం తీసుకునేంత వరకు వేచి చూడాలని, దేనికైనా సిద్ధంగా ఉండాలని సిఎం అన్నట్లు తెలిసింది.

నేటి నుంచి అసెంబ్లీ

- ఇవే చివరి సమావేశాలు ?
- 21 బిల్లులు పెట్టే అవకాశం
- నేడు బిఎసిలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ 15వ శాసనసభ 11వ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు సంతాప తీర్మానం అనంతరం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఎన్ని రోజులు శాసనసభ జరపాలనేది నిర్ణయం తీసుకోనున్నారు. 15వ శాసనసభకు ఇవే చివరి సమావేశాలు కానున్నట్లు తెలిసింది. సంఖ్యాపరంగానూ 11వ సెషన్ కావడంతో ఇంతటితోనే దీన్ని ముగించేయాలని, తరువాత కొత్త ప్రభుత్వంలోనే ఏర్పాటు చేయాలనే ఆలోచనతోనూ ఉన్నట్లు తెలిసింది. అయితే ఎన్నికలు జరిగేలోపు బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశమూ లేకపోలేదని, 12వ సంఖ్య జోలికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లో మొత్తం 21 బిల్లులు పెట్టనున్నారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగురోడ్డు అంశాలపైనా ప్రత్యేక అంశంగా చర్చకు తీసుకొచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రతిపక్ష టిడిపి కూడా ఈ సమావేశాలకు హాజరై చంద్రబాబు అరెస్టు క్రమంలో చట్టపరమైన ఉల్లంఘనలకు పాల్పడిన అంశాలను సభావేదికగా బయటపెట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ కక్షసాధింపు అంశాలనూ ఈ సమావేశాల్లోనే చర్చించనున్నారు.

పటిష్ట బందోబస్తు

శాసనమండలి, శాసనసభ సమావేశాలు గురువారం నుంచి జరగనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తుతోపాటు అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. శాసనసభ కమిటీ హాలులో బుధవారం మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు, స్పీకరు తమ్మినేని సీతారాం అధ్యక్షతన పలు శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలపై సమీక్షిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో పోలీస్, మార్షల్స్ ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాస్ లేకుండా ఏ ఒక్కరినీ అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించవద్దని డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డికి సూచించారు. ఇతరులకు ఎటువంటి విజిటింగ్ పాస్‌లు జారీ చేయొద్దని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులను ఆదేశించారు. సభ్యుల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీరో అవర్‌లో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు అధికారులు వెంటనే తెలపాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ లేని పెన్షన్ విధానం

- జిపిఎస్‌పై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


జిపిఎస్ అనేది గ్యారెంటీ లేని పెన్షన్ విధానమని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గ్యారెంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. జిపిఎస్ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం చేసినట్లు వచ్చిన వార్తలను వ్యతిరేకిస్తున్నామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిపిఎస్ అనేది సిపిఎస్‌కు మరో ప్రతిరూపం తప్ప దీనివల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. పదేపదే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నా ప్రభుత్వం మొండిగా జిపిఎస్‌ను అమలు చేయడానికే సిద్ధపడటం అభ్యంతరకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల మనోభావాలను పెడచెవిన పెట్టి జిపిఎస్ అమలుకు పూనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిపిఎస్ అమలు కోసం తొందరపడుతున్న ప్రభుత్వం 2004 సెప్టెంబరు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన 11,000 మందిని కేంద్ర ప్రభుత్వ జిఓ ప్రకారం ఒపిఎస్‌లోకి ఎందుకు తీసుకురావడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముందుగా వారందరినీ ఒపిఎస్ విధానంలోకి తీసుకురావాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అసంతృప్తిని గమనించి ప్రభుత్వం ఒపిఎస్ అమలు చేయకపోతే త్వరలో ఇతర సంఘాలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జిపిఎస్‌ను మంత్రి మండలి ఆమోదించటం ఉద్యోగులను మోసం చేయడమేనని ఎస్‌టియు విమర్శించింది. ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సిపిఎస్ రద్దు కోసం అనేక ఉద్యమాలు చేశాయని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, హెచ్ తిమ్మన్న పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భద్రత లేని, ఆమోదం లేని జిపిఎస్‌ను కేబినెట్ ఆమోదించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి తెలిపారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాతపెన్షన్ అమలు కోసం ఏళ్లతరబడి జరిపిన పోరాటం జిపిఎస్‌గా రూపాంతరం చెందడం ఆమోదయోగ్యం కాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నరహరి, ఎన్‌వి రమణయ్య పేర్కొన్నారు. ఒపిఎస్‌ను మాత్రమే పునరుద్ధరించాలని, జిపిఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులు అంగీకరించటం లేదని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు తెలిపారు. జిపిఎస్ బిల్లుతో ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఎపిసిపిఎస్ఇఎ అసోసియేట్ ప్రెసిడెంట్ సిఎం దాస్ విమర్శించారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- నందవరం (కర్నూలు జిల్లా)



కర్నూలు జిల్లా నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన దళిత రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... కనకవీడు గ్రామానికి చెందిన ఎ.లింగన్న (54) తన 1.50 ఎకరాల పొలంలో గత మూడు సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నారు. పెట్టుబడి కోసం బ్యాంకు, బంధువులు వద్ద దాదాపు రూ.5.25 లక్షలు అప్పు చేశారు. పంటలు సరిగా పండక నష్టపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకపోవడం, అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆత్మహత్య చేసుకోవడానికి మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పురుగుల మందు తాగారు. నోటి నుంచి నురగలు వస్తూ అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయినా, ఫలితం లేకపోయింది. బుధవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారు. లింగన్న భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలల ముందు పొత్తులపై నిర్ణయం

- ఇప్పటికీ జనసేనతో పొత్తులో ఉన్నాం : పురందేశ్వరి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల పొత్తులకు సంబంధించి రెండు, మూడు నెలల ముందు నిర్ణయిస్తామని, ప్రస్తుతం జనసేనతో పొత్తులో ఉన్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఏలూరులోని సుఖీభవ కల్యాణ మండపంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లు చారిత్రాత్మకమైనదని, 2027 నుంచి బిల్లు అమల్లోకి వస్తుందని తెలిపారు. టిడిపితో ఎందుకు పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందో పవన్ చెప్పారని, ఆయన నిర్ణయంపై తమ పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. చంద్రబాబుపై కేసు వేసింది తాము కాదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేంద్రమే ఇస్తోందని, విడుదల చేసిన నిధులను రాష్ట్రం సక్రమంగా ఖర్చు చేయడం లేదని విమర్శించారు.

అసైన్డ్ చట్ట సవరణపై 29న నిరసన

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించకపోతే ఈ నెల 29న భారీ నిరసన చేపడతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కబ్జా చేసిన భూస్వాములకు కట్టబెట్టడానికి అసైన్డ్ చట్ట సవరణకు కేబినెట్ ఆమోదాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చట్టాన్ని పాత పద్ధతిలో యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతరం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల పోరాటాల వల్ల రాష్ట్రంలో సుమారు 33 లక్షల ఎకరాల భూమి ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేశాయన్నారు. ఇందులో 13 లక్షల ఎకరాల భూమి పేదల నుంచి పెత్తందార్లు అక్రమంగా, దౌర్జన్యంగా లాక్కున్నట్లు ప్రభుత్వ లెక్కలే తెలియజేస్తున్నాయన్నారు. 9/77 చట్టం ప్రకారం ఆ భూములు తిరిగి పేదలకు ఇవ్వాలన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టడానికి ఎన్నికల కానుకగా అసైన్డ్ చట్టాన్ని భూస్వాములకు అనుకూలంగా మార్పు చేసిందన్నారు. దీనివల్ల 13 లక్షల మంది దళితులు, బలహీన వర్గాల పేదలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

ప్రాణాలు పోతున్నా విద్యార్థులను కాపాడి మృతి

ప్రజాశక్తి-అద్దంకి (బాపట్ల జిల్లా)

పాఠశాల బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ అంత బాధలోనూ సమయస్ఫూర్తితో బస్సును పక్కకు తీసి ఆపాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాసేపటికే గుండెపోటుతో మృతి చెందారు. ప్రాణాలు పోతున్నా డ్రైవర్ పిల్లలను కాపాడారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా అద్దంకిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణానికి చెందిన గుర్రాల ఏడుకొండలు (55) చైతన్య పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎప్పటిలాగానే వెంపరాల రూట్‌లోని గ్రామాలలో విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు వస్తున్నారు. వెంపరాల సమీపంలో ఏడుకొండలుకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సును రోడ్డు పక్కన నిలిపారు. గుండె నొప్పిగా ఉందని విద్యార్థులకు తెలిపి మంచినీరు తాగాడు. వెంటనే స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించి డ్రైవర్‌ను కిందకు దించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. స్కూల్ యాజమాన్యం, పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థులను అదే బస్సులో మరో డ్రైవర్ సాయంతో అద్దంకికి చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బిజెపితో పొంచి ఉన్న ప్రమాదం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

కేంద్ర ప్రభుత్వంలో మోడీ, బిజెపి ఉన్నంతలో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, దళితులంతా ఈ కుట్రను తిప్పి కొట్టి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. దళిత రక్షణ యాత్రలో భాగంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పటవల, కొత్తూరు, రాఘవేంద్రపురం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సమస్యలపై పోరాటాలకు దళితులు సిద్ధం కావాలని కోరారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం వల్ల దళితులకు హక్కులు, స్వేచ్ఛ, ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. అటువంటి రాజ్యాంగాన్ని బిజెపి సర్కారు రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆందోళన చెందారు. ఈ కుట్రను తెలియజేయాలనే సంకల్పంతో దళిత రక్షణ యాత్రలను ప్రారంభించామని తెలిపారు. బిజెపి కుట్రను తిప్పి కొట్టకపోతే దళితులకు భవిష్యత్తులో మనుగడ ఉండదన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో, ప్రస్తుతం జగన్ హయాంలోనూ దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగాయన్నారు. వైసిపి సర్కారు దళితుల సబ్ ప్లాన్ నిధుల్ని పక్కదారి పట్టించిందని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధుల్ని దళితులకు ఇవ్వకుండా అందరికీ పంచే కార్యక్రమాన్ని జగన్ చేపట్టారన్నారు. దళితుల శ్మశానాలు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. సబ్ ప్లాన్ నిధుల్ని కేటాయించాలని, అసైన్డ్ భూములను తిరిగి దళితులకు అప్పగించాలని, అసైన్డ్ భూములను అమ్ముకోవడానికి హక్కు కల్పిస్తూ వైసిపి ప్రభుత్వం తీసుకొస్తున్న సవరణ జిఒను రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 29న విజయవాడలో మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. దీన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్ శ్రీనివాస్ ఉన్నారు.



తాళ్లరేవు మండలం రాఘవేంద్రపురంలో దళితులతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

భువనేశ్వరికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఉంటున్న ఆయన సతీమణి భువనేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులను బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. సినీ నిర్మాత ఆదిశేషగిరిరావు ఆమెను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ తరహా కక్ష సాధింపు రాజకీయాలు లేవని, జగన్ పాలనలో కొత్త తరహా రాజకీయాలు చూస్తున్నామన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, ఏకపక్షంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

రాష్ట్రంలో జగన్ ప్రతీకార రాజకీయం : శైలజానాథ్


రాష్ట్రంలో పగ, ప్రతీకారాలు రాజ్యమేలుతున్నాయని, కక్షసాధింపు కోసం ప్రభుత్వం ప్రయివేటు లాయర్లను పెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని పిసిసి మాజీ అధ్యక్షులు సాకె శైలజానాథ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో ఉన్న భువనేశ్వరిని ఆయన పరామర్శించారు. అనంతరం శైలజానాథ్ మాట్లాడుతూ మంత్రులు శాఖాపర అంశాలు మానేసి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి పోరాటం ఎంతో హుందాగా ఉండేదని పేర్కొన్నారు. ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు మునుపెన్నడూ చూడలేదని తెలిపారు.

ఆరవ చిరుత బందీ

- యాత్రికుల భద్రతే ముఖ్యం: టిటిడి

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో టిటిడి ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో మరో చిరుత చిక్కింది. కొద్ది రోజుల క్రితం కాలినడక మార్గంలో చిన్నారి లక్షితపై పులి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన ప్రదేశానికి అతి సమీపంలోనే 2850 మెట్టు దగ్గర టిటిడి అటవీశాఖ అధికారులు చిరుత కోసం బోను ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజామున బోనులో చిరుత చిక్కింది. గత వారం రోజులుగా అదే ప్రాంతంలో చిరుత తిరుగుతున్నట్లుగా అధికారులు గుర్తించారు. బోనులో చిక్కిన చిరుతను చిరుతను అధికారులు తిరుపతిలోని జూపార్క్‌కు తరలించారు. ఇప్పటి వరకూ మొత్తం 6 చిరుతలు చిక్కాయి. వాటిలో నాలుగింటిని జూపార్క్‌కు తరలించారు. రెండు చిరుతలను అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. బోనులో చిరుత చిక్కిన ప్రాంతాన్ని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గడిచిన రెండు నెలల కాలంలో ఇప్పుడు పట్టుబడిన చిరుతతో కలిపి మొత్తం ఆరు చిరుతలను పట్టుకున్నట్లుగా తెలిపారు. యాత్రికుల భద్రతపై టిటిడి ఎంత చిత్తశుద్ధితో ఉందో తెలుసుకోడానికి ఇదే ఉదాహరణ అని ఆయన తెలిపారు. యాత్రికులు ఏ రకమైన ఇబ్బంది కలగకుండా అన్నీ చర్యలు టిటిడి తీసుకుంటుందని చెప్పారు. ఆపరేషన్ చిరుత కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఇంకా తిరుగుతున్న చిరుతలను పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 300పైగా ట్రాప్ కెమెరాలతో నిఘా పర్యవేక్షణ చేస్తున్నట్లుగా చెప్పారు.



చిరుత బందీ అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టిటిడి చైర్మన్ భూమన



సింహవాహనంపై విహరిస్తున్న మలయప్పస్వామి

సింహ వాహనంపై విహరించిన శ్రీవారు

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను వైభంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజైన బుధవారం ఉదయం మలయప్పస్వామి వారు సింహ వాహనంపై యోగ నరసింహుడి అలంకారంలో కొలువుతీరారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. బుధవారం రాత్రి ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు అభయమిచ్చారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలకు జియో ట్యాగ్

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే చిన్నపిల్లలు తప్పిపోకుండా టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, జెఇఒ సదా భార్గవి, తిరుమల అదనపు ఎస్‌పి మునిరామయ్యతో కలిసి జియో ట్యాగింగ్ కట్టడం ప్రారంభించారు.

హైకోర్టులో నవదీప్‌కు ఎదురుదెబ్బ

- 41ఎ నోటీసులిచ్చి విచారించాలని ఆదేశం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ కేసులో నార్కోటిక్ బ్యూరో నిందితుడిగా పేర్కొన్న నటుడు నవదీప్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. గతంలోనూ ఆయనపై డ్రగ్స్ కేసులున్నాయని నార్కోటిక్ పోలీసులు కోర్టుకు తెలిపారు. గతంలో డ్రగ్స్ కేసుల్లో నవదీప్ నిందితుడిగా లేరని ఆయన తరుపు న్యాయవాది సిద్ధార్థ్ వాదించారు. దర్యాప్తు సంస్థల ముందు నవదీప్ హాజరయ్యారని, మాదాపూర్ డ్రగ్స్ కేసుతో ఆయనకు సంబంధం లేదని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి 41ఎ కింద నోటీస్ ఇచ్చి నవదీప్‌ను విచారించాలని నార్కోటిక్ పోలీసులను ఆదేశించారు.

అమరావతిలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మంత్రివర్గ సమావేశంలో పాల్గొనేందుకు మందడంలోని రైతు దీక్షా శిబిరం ముందు నుండి సచివాలయానికి వెళుతున్న సమయంలో రైతులు నినాదాలు చేస్తూ రోడ్డు పైకి రావడానికి యత్నించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సిఎం కాన్వాయ్ వెళ్లే వరకూ రైతులు, మహిళలు రోడ్డుపైకి రాకుండా తాళ్లతో అడ్డుగా నిలబడ్డారు. మే నెలలో ఇవ్వాల్సిన కౌలు ఇంతవరకు చెల్లించ లేదని, రాజధాని లేని రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, మా కొద్దు రాక్షస పాలన అంటూ రాజధాని రైతులు, మహిళలు ప్ల కార్డులు ప్రదర్శించారు. నల్ల జెండాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వృద్ధులు, చిన్నారులు సైతం నిరసన తెలిపారు. అనంతరం రైతులు శిబిరంలోకి వెళ్లి యధావిధిగా దీక్షలు కొనసాగించారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ చేస్తున్న దీక్షలు బుధవారంతో 1373 వ రోజుకు చేరాయి.



మందడం రైతు శిబిరం వద్ద రైతులు, మహిళలను రోడ్డు పైకి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బిజెపి

- పాలకుల విధానాల వల్లే వలసలు పెరుగుతున్నాయి..
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య



సభలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

ప్రజాశక్తి-కొండపి (ప్రకాశం జిల్లా)

దేశంలో, రాష్ట్రంలో పాలకుల విధానాల వల్ల అభివృద్ధి లేక, సాగు, తాగునీరు లేక ప్రజల వలసలు పెరుగుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య తెలిపారు. ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని పెరిదేపి గ్రామంలో సిపిఎం పోరు యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి బహిరంగ సభ జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెజి మస్తాన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కృష్ణయ్య మాట్లాడారు. పన్నుల భారాల నుంచి కార్పొరేట్లకు విముక్తి కల్పించి వారి ఆస్తులను రూ.కోట్లల్లో పెరిగే విధంగా చేసిన ఘనత బిజెపి ప్రభుత్వానిదేనని విమర్శించారు. ప్రజలను మద్యానికి బానిసలను చేసి, వారి సమస్యలపై ప్రశ్నించకుండా ఉండేలా పాలకులు చేస్తున్నారని తెలిపారు. సిపిఎం పోరుబాట పాదయాత్ర ప్రజల అభివృద్ధిని కోరుతూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. సాగునీరు, పంటల గిట్టుబాటు ధరలపై పాలకులు దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో చంద్రబాబును జైలుకు పంపడంపై వైసిపి, టిడిపి నాయకుల మధ్య చర్చే తప్ప, ప్రజల సమస్యలు పట్టడం లేదన్నారు. అభివృద్ధిని విస్మరించి పాలన సాగిస్తూ,జిల్లాలో వెనుకబాటుతనానికి కారణమైన పాలకులను రాబోయే రోజుల్లో నిలదీస్తూ ప్రజలు చైతన్యవంతంగా ఉద్యమించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్రా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చే ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయినా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి నిరుద్యోగుల్ని చేసిన పరిస్థితి ఉందని తెలిపారు. కార్యక్రమంలో పోరుబాట బృందం నాయకులు పాల్గొన్నారు.

43 మంది ఆకాశ ఎయిర్ పైలట్ల రాజీనామా

న్యూఢిల్లీ : బడ్జెట్ ధరల విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ సంక్షోభంలో పడింది. ఆ సంస్థ తీరును నిరసిస్తూ 43 మంది పైలట్లు వైదొలిగారు. తమ వేతనాల ఒప్పంద విధానాన్ని సంస్థ ఉల్లంఘించడంతో అనుహ్యాంగా పైలట్లు రాజీనామా చేశారు. దీంతో వందలాది విమానాలను రద్దు చేసుకుంది. జులై నుంచే అంతరంగంగా పైలట్ల తిరుగుబాటు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామం ఆ సంస్థతో పాటు పౌర విమానయాన రంగం పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఆకాశ ఎయిర్ ఏ విధమైన వేతన ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడిందనే విషయం పూర్తిగా బయటికి రావాల్సి ఉంది. కీర్తిశేషులు రాకేష్ ఝున్‌ఝున్‌వాలా ప్రధాన వాటాదారుగా గతేడాది ఆగస్టులో దేశీయంగా విమాన సేవలను ప్రారంభించిన ఆకాశ ఎయిర్.. ఇటీవలే అంతర్జాతీయ విమానయాన సేవలకు అనుమతి పొందింది. ఇందుకోసం బోయింగ్ 737 మ్యాక్స్ విమానాన్ని అందుకుంది. తన 20వ ఎయిర్‌క్రాఫ్ట్‌ను జోడించుకోవడంతో పాటుగా అంతర్జాతీయ సేవలకు అనుమతులు పొందడంతో వేడుకలు జరుపుకుంది. ఇంతలోనే సంస్థ తమ వేతన ఒప్పందం అంశంలో పైలట్లు తిరుగుబాటు చేయడంతో సంస్థ సంక్షోభంలోకి జారుకున్నట్లయ్యింది. అనుహ్యాంగా వైదొలిగిన పైలట్లపై చర్యలు తీసుకునేలా డిజిసిఎకు ఆదేశాలు ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆకాశ ఎయిర్ ఆశ్రయించింది. పైలట్ల రాజీనామా వల్ల ఆగస్టులో 600 విమానాలను, సెప్టెంబర్‌లో దాదాపు 700 విమానాలు రద్దు చేసుకున్నామని కోర్టుకు తెలిపింది. కాగా పైలట్ల రాజీనామా పరిణామంతో తాత్కాలికంగా పలు విమానాలను కుదించుకుంటున్నామని ఆకాశ ఎయిర్ సిఇఒ వినయ్ దుబే పేర్కొన్నారు. సంస్థను మూసివేయబోమని ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో ఆయన హామీ ఇచ్చారు. అనూహ్యాంగా రాజీనామా చేసిన పైలట్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సంపాదకీయం

మహిళాలోకానికి జేజేలు

ఎట్టకేలకు మహిళా రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం హర్షణీయం. దాదాపుగా పార్లమెంటులోని అన్ని పార్టీలు బలపరుస్తుండటంతో రాజ్యసభలోనూ ఆమోదం పొందడం లాంఛనమే. ఆ తరువాత కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు దీనిని ఆమోదించాల్సి ఉంది. బిల్లు చట్ట రూపం దాల్చితే లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు దఖలు పడతాయి. ఇది ఒక్కరోజులో చోటుచేసుకున్న పరిణామం ఏమీ కాదు. దశాబ్దాల తరబడి మహిళాలోకం చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడుతోంది. ఆకాశంలో సగానికి, అవకాశాల్లో కూడా సగం ఇచ్చి తీరాలని నినదిస్తోంది. నిజానికి జాతీయోద్యమంలోనే ఈ దిశలో ఆకాంక్షలు వ్యక్తమైనాయి. స్వతంత్ర పోరాటంలో ముందుకురికిన పలువురు మహిళా నేతలు సమభావనను వ్యక్తం చేశారు. నేతాజీ ఏర్పాటు చేసిన అజాద్ హింద్ ఫౌజ్‌లో మహిళా దళపతిగా బ్రిటిష్‌వారిపై సమరశంఖం పూరించిన కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చివరి వరకు సమానత్వ పోరునే శ్వాసించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, రాజ్యాంగ సభ సభ్యురాలు హంసా మెహతా అన్ని రంగాల్లో సమన్యాయం కోరుతున్నామని చెప్పారు. స్వతంత్ర భారతదేశంలో మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ అవకాశాలు లభిస్తాయని ఆమె ఆకాంక్షించారు. రాజ్యాంగ పీఠికలోనూ, ఆదేశ సూత్రాల్లోనూ ఈ భావనే వ్యక్తమైంది. కానీ, ఆచరణలో ఏం జరిగిందో చూశాం! సమాన అవకాశాల సంగతి అలా ఉంచితే, ప్రాతినిధ్యం కోసమే పోరాటం చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా బిల్లులో ప్రతిపాదించింది కూడా 33 శాతమే కావడం గమనార్హం! స్థానిక సంస్థల రిజర్వేషన్ల రూపంలో వచ్చిన అవకాశాన్ని మహిళలు అందిపుచ్చుకున్నారు. అత్యధిక చోట్ల స్థానిక సంస్థల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. సమర్థతను నిరూపించుకుని అభివృద్ధికి బాటలు వేశారు. ఎన్నో అవమానాలను, అవహేళనలను, అవాంతరాలను అధిగమించి పట్టుదలతో భారత మహిళాలోకం సాగించిన పోరాట ఫలితమే ఈ బిల్లు! అందుకే వారికి జేజేలు!

సుదీర్ఘ పోరాట ఫలితంగా వాస్తవరూపం దాల్చనున్న మహిళాలోకపు ఈ స్వప్నాన్ని సైతం ఎన్నికల ప్రయోజనాలకు వాడుకోవడానికి మోడీ, ఆయన పరివారం సిద్ధపడటం దారుణం. మోడీ ఘనతగా దీనిని చిత్రీకరించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. నిజానికి, తొమ్మిదేళ్ల మోడీ సర్కారు వైఫల్యాల నుండి దేశ ప్రజల, ముఖ్యంగా మహిళల దృష్టి మళ్లించడానికి చేస్తున్న ప్రయత్నమిది. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2014 ఎన్నికల ప్రచారం సందర్భంగా మోడీ ఇచ్చిన హామీ. అంత చిత్తశుద్ధి ఉంటే అధికారంలో కొనసాగిన ఈ తొమ్మిదేళ్లు ఏం చేశారు? చివరి దశలో బిల్లును ఎందుకు ప్రవేశపెడుతున్నారు? పోనీ, తక్షణం జరగనున్న 2024 ఎన్నికల్లో మహిళలకు ఏమైనా ప్రయోజనం కలుగుతుందా? ఎన్నికల తరువాత ఏర్పడనున్న 18వ లోక్‌సభలో మహిళల సీట్లు ఏమన్నా పెరగనున్నాయా? బిల్లులో పేర్కొన్న ప్రకారం అలా జరగదు. ముందు జనాభా లెక్కల ప్రక్రియ పూర్తికావాలి. ఆ తరువాత నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. అప్పుడే కొత్త రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చలో మాట్లాడిన హోంమంత్రి అమిత్‌షా 2029 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమలులోకి వస్తాయని చెప్పారు. మరి ఇప్పుడు ఈ హడావిడి ఏ ప్రయోజనాల కోసమో అర్థం కావడం లేదూ! అందుకే, బిల్లుకు మద్దతు తెలిపిన అనేక పార్టీలు రిజర్వేషన్లను తక్షణం అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశాయి.

మోడీ సర్కారుపై ప్రజానీకంలో కొంత కాలంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో ఎన్నికల వేళ ఆపదమొక్కులు ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితమే గ్యాస్ ధరను తగ్గించిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు మహిళా బిల్లును ముందుకు తెచ్చింది. 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే మనువాద భావజాలానికి పట్టం కట్టే బిజెపి మహిళాభ్యున్నతికి ఎప్పటికీ వ్యతిరేకమే! ఎన్నికల వేళ ఆ పార్టీ ప్రదర్శించే ఇటువంటి టక్కుటమార విద్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

మహనీయుల మాట



కులమనేది కేవలం
శ్రమను మాత్రమే కాదు...
కార్మికులను కూడా విభజించేది.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

విశ్లేషణ

సనాతనం - సనాతన ధర్మం

ఎం.వి.ఎస్. శర్మ

సనాతన ధర్మం మీద దాడి జరుగుతోందని, దానిని తిప్పికొట్టాలని ప్రజలకు మన దేశ ప్రధాని స్వయంగా పిలుపునిచ్చారు. తమిళనాడు మంత్రి దయానిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ ఇటీవల చేసిన ప్రసంగాన్ని ఆధారం చేసుకుని మోడీ తన ఎదురుదాడిని ప్రారంభించారు. ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటో ముందు చెప్పి, దానిని కాపాడమని మోడీ చెప్పివుంటే కొంతైనా అందులో నిజాయితీ ఉందని ఒప్పుకోవచ్చు. కాని మోడీ సనాతన ధర్మం అంటే ఏమిటో చెప్పలేదు. దయానిధి స్టాలిన్ అలా కాదు. సమాజంలో నేటికీ అనాది నుండీ కొనసాగుతూవున్న వివిధ తరహాల వివక్షతలకు మూలం అయిన సనాతన ధర్మాన్ని వ్యతిరేకించాలని ఆయన స్పష్టంగా చెప్పాడు. ఇది మనం మొదట గమనించాలి.

అనాదిగా సమాజంలో కొనసాగుతున్న భావాలను, సిద్ధాంతాలను, సాంప్రదాయాలను, నమ్మకాలను, ఆచారాలను అన్నింటినీ సనాతనమైనవిగా పరిగణిస్తాం. పురాతన కాలంలో గొప్పవిగా చలామణీ అయిన భావాలన్నీ ఇప్పుడూ గొప్పవిగా చలామణీ కాకపోవచ్చు. వాటిలో కొన్ని ఇప్పటికీ గొప్పవి గానే చలామణీ అవుతూ వుండవచ్చు కూడా. కనుక సనాతన అన్న పదం తగలగానే అది తప్పకుండా గొప్పదే అయివుండాలన్న రూలు ఏమీ లేదు. నరబలి, సతీ సహగమనం, దేవదాసీ విధానం, అంటరానితనం వంటివి గొప్పవి అని ఎవరైనా చెప్తారా? పోనీ మన ప్రధాని మోడీ గారు చెప్పగలరా?

"రాజ్యం వీరభోజ్యం" అని పాత కాలంలో అనేవారు (దానిని అప్పటి సామాన్య ప్రజానీకం అందరూ అంగీకరించే వారా అంటే అవును అని మాత్రం ఖచ్చితంగా చెప్పలేం.).

ఛత్రపతి శివాజీని హిందూ ధర్మ రక్షకుడు అని ఆర్‌ఎస్‌ఎస్ వారు పొగుడుతారు. కాని అదే శివాజీ తన బల పరాక్రమాలతో (తన సైన్యం బల పరాక్రమాలు కూడా కలిపే అనుకోండి) మరాఠా రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించడానికి పట్టాభిషిక్తుడు అవుదామనుకుంటే అప్పట్లో ఏ ఒక్క బ్రాహ్మడూ ఆ పట్టాభిషేకపు మతపరమైన తంతును నిర్వహించడానికి ఒప్పుకోలేదట. కారణం శివాజీ ఒక శూద్ర కులానికి చెందినవాడవడమే.

చివరికి శివాజీ ఎవడో ఒక మూల ఉన్న పేద బ్రాహ్మడిని పట్టుకుని అంతులేని కానుకలను దక్షిణగా ఇస్తే, అప్పుడు కూడా ఆ బ్రాహ్మడు తన కాలి బొటనవేలితో శివాజీ నుదుట తిలకం దిద్దేడట. ఇది కథ కాదు, చరిత్ర. దానిని రాసినందుకే గోవింద పన్సారే ని ఆర్‌ఎస్‌ఎస్ హంతకులు పొట్టన పెట్టుకున్నారు (ఆ విధంగా అది వాస్తవ చరిత్రేనని వాళ్ళే ఒప్పుకున్నట్టైంది).

రాజ్యం వీర భోజ్యం అని స్వయానా శ్రీకృష్ణుడు భగవద్గీతలో అర్జునుడితో చెప్పేడని అంటారు. మరి శ్రీకృష్ణుడు చెప్పిన ఆ ధర్మాన్ని పాటించి యుద్ధం చేసి రాజ్యాన్ని సాధించిన శివాజీకి బ్రాహ్మలు ఎందుకు పట్టాభిషేకం చేయలేదు? ఆ బ్రాహ్మలు సనాతన ధర్మాన్ని (దేవుడే స్వయంగా చెప్పేడని కదా అంటారు?) పాటించేరా? లేక శివాజీ పాటించేడా? సనాతన ధర్మం ప్రకారం క్షత్రియులు మాత్రమే రాజులుగా పాలించాలి. కాబట్టి బ్రాహ్మలు ఆ విధంగా వ్యవహరించేరు అని సమర్ధించుకుంటే అప్పుడు శివాజీ సనాతన ధర్మాన్ని ధిక్కరించినట్టు అవుతుంది. మరి ఆర్‌ఎస్‌ఎస్ వాళ్ళే చెప్పాలి సనాతన ధర్మాన్ని ధిక్కరించిన శివాజీ వాళ్ళకి ఎందుకు హీరో అయ్యాడు? ఇప్పుడు దయానిధి స్టాలిన్ ఎందుకు విలన్ అయ్యాడు?

> కాబట్టి సనాతన ధర్మం అన్న పదాన్ని చూసి దీనిని వ్యతిరేకించడం అంటే గతంలో మన సమాజం అప్పటా, అప్పటా సాధించిన విజయాలను వ్యతిరేకించడం అని అనుకోకూడదు. మనం గొప్పగా చెప్పుకునే గతకాలపు ఔన్నత్యం చాలా పరిమితం. ఇప్పుడు పేదరికంతో, అవిద్యతో, నిరుద్యోగంతో, ఆకలితో అలమటిస్తున్న కోట్లాది ప్రజల కడగండ్లను తీర్చి "లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అన్న సనాతన ఆదర్శం నెరవేర్చాలంటే ఈ సనాతన మనువాద ధర్మాన్ని నిలువులోతు గొయ్యి తీసి పాతి పెట్టాల్సిందే. కుల వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిందే.



చెప్పొచ్చేదేమంటే మానవ సమాజం నిరంతరం ముందుకు సాగిపోతూనే వుంటుంది. ప్రతీ దశలోనూ మానవులు కొన్ని సాంప్రదాయాలను, ఆచారాలను, విశ్వాసాలను రూపొందించుకుంటారు. కొన్నాళ్ళు గడిచాక ఆ సాంప్రదాయాలలో కొన్ని సమాజ పురోగతికి అవరోధాలుగా మారిపోతాయి. ఆచారాలలో కొన్ని దురాచారాలుగా పరిగణింప బడతాయి. విశ్వాసాలలో కొన్ని మూఢ విశ్వాసాలుగా మారిపోతాయి.

ఇలా సమాజ పురోగతికి అవరోధాలుగా మారిన వాటిని తిరస్కరించి కొత్త సాంప్రదాయాలను, కొత్త ఆచారాలను మానవులు రూపొందించుకుంటారు.

అదే సమయంలో కొన్ని ఆదర్శాలు, సాంప్రదాయాలు సమాజం ఎంత మారినా వాటి విలువను పోగొట్టుకోవు. చాలా పురాతనమైన శాంతి మంత్రం ఈ విధంగా ఉంటుంది:

సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై. తేజస్వినావధీతమస్తు, మా విద్విషావహై-అంటే మనమంతా కలిసి జీవిద్దాం, కలిసి నేర్చుకుందాం, కలిసి మన శక్తి సామర్ధ్యాలను పెంపొందించుకుందాం, మన మధ్యలో విద్వేషాలు వద్దు అని అర్థం.

సర్వేపి సుఖినస్సంతు-అంటే అందరూ సుఖంగా ఉండాలి.

సర్వే భద్రాణి పశ్యంతు-అంటే అందరూ శుభములనే చూడాలి (అందరికీ శుభాలు కలగాలి).

మా కశ్చిద:కభాగ్భవేత్ -అంటే ఏ ఒక్కడూ దు:ఖితుడు కారాదు.

లోకాస్సమస్తాస్సుఖినోభవంతు అంటే సకల లోకములలోనూ సుఖశాంతులు నెలకొనుగాక.

వసుధైవ కుటుంబకమ్ అంటే ఈ భూమండలమంతా ఒకే కుటుంబం అన్న భావనను కలిగి వుండడం.

పైన చెప్పినవన్నీ సనాతన భావాలే. కాని ఉదాత్తమైన భావాలు.

ఓం శాంతి: శాంతి: శాంతి: అని మంత్రాలు చదవడానికి మోడీ గారికి ఏ అభ్యంతరమూ లేదు. వసుధైవ కుటుంబకమ్ అని కూడా అంటూ వుంటారు. కాని ప్రపంచంలో ఇప్పుడు జరిగే యుద్ధాలకు, ఆయుధ పోటీకి, సైనిక కూటముల ఏర్పాటుకు నాయకత్వం వహిస్తున్న అమెరికాకు పూర్తి విధేయుడిగా ఉంటారు మోడీ. "చెప్పడానికే నీతులు...." అన్న సామెత ఊరికే వచ్చిందా?

వెరసి గత కాలపు భావాలలో, ఆచారాలలో, సాంప్రదాయాలలో మనం ముందుకు సాగడానికి ఉపకరించే వాటిని మాత్రం కొనసాగిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త భావాలకు, కొత్త సాంప్రదాయాలకు మనం స్వాగతం పలకాలి. అందుకే మహాకవి గురజాడ 'మంచి గతమున కొంచెమేనోయ్, మందగించక ముందడుగేయ్' అని దిశానిర్దేశం చేశాడు.

ఇంతవరకూ సనాతన భావాల గురించి చర్చించాం. ఇక సనాతన 'ధర్మం' గురించి చర్చించాలి. ఇప్పుడు మోడీ గొడవ అంతా ఆ సనాతన ధర్మం గురించే.

ధర్మం అంటే ఆయా కాలాల్లో సమాజం మీద ఆధిపత్యాన్ని చెలాయించిన వారు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోడానికి రూపొందించిన నిబంధనలు. ఆదిమ కాలంలో పాలకులు, పాలితులు అంటూ వేరే వేరే లేరు గనుక ధర్మం అంటూ వేరే లేదు. కేవలం కొన్ని విశ్వాసాలు, ఆచారాలు, సాంప్రదాయాలు రూపొందాయి. ఒకసారి సమాజం వేర్వేరు వర్గాలుగా చీలిపోయాక ఆధిపత్య వర్గాలు ఏర్పడ్డాక ధర్మం అనే ప్రస్తావన ముందుకొచ్చింది.

మన దేశంలో వర్గాలుగా సమాజం విడిపోవడం, కుల వ్యవస్థ రూపొందడం, దాదాపు ఏకకాలంలో జరిగాయి. బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందినవారు ఆధిపత్య వర్గంగా వ్యవహరించడం మొదలయ్యాక వారి ఆధిపత్యంతోబాటు, దోపిడీతోబాటు కుల వ్యవస్థ విస్తరించింది. దానితోబాటు దిగువ కులాలవారిని అణచివేయడమూ పెరిగింది. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోడానికి స్మృతులు లేదా ధర్మ శాస్త్రాలు రూపొందాయి. అందులో పేర్కొన్న ధర్మాలు సమాజం మొత్తం ఆమోదించినవి ఎంతమాత్రమూ కావు. కొద్దిమంది ఆధిపత్య కులాలవారు మాత్రమే వాటిని వారి పెత్తనం కొనసాగడం కోసం రూపొందించుకున్నారు. అలా వచ్చినవే మను స్మృతి, నారద స్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, కౌటిల్యుడి అర్థశాస్త్రం వంటివి. ఇవన్నీ పాలకులు పాలకులకోసం రాసుకున్నవి. కాని అవి అమలు కావాలంటే వాటిని ప్రజల మీద రుద్దాలి. అందుకే ఆ దోపిడీ వర్గ ధర్మాలకు అక్కడక్కడా కొన్ని మంచి మాటల ముసుగు వేసి ప్రచారం చేశారు. అందుకోసం పురాణాలను రాశారు.

ధర్మాన్ని రక్షిస్తాను అని ప్రతీ రాజూ అధికారం చేపట్టినప్పుడు ప్రతిజ్ఞ చేయాలి (ఇప్పుడు పదవి కావాలంటే ఎన్నికల్లో గెలిచాక రాజ్యాంగానికి లోబడివుంటాను అని ప్రమాణం చేసినట్టు). ధర్మాన్ని కాపాడడంలో విఫలుడైన రాజును పదవి నుండి తొలగించే అధికారం ధర్మవేత్తలకు ఉండేది.

మనస్మృతి ఏం చెప్పిందో మనం గతంలో చాలాసార్లు ప్రస్తావించుకున్నాం గనుక ఆ వివరాల జోలికి ఇప్పుడు పోవడం లేదు. కాని సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను, అత్యధిక మెజారిటీగా ఉన్న శూద్ర, అతిశూద్ర, దళిత కులాలవారిని అత్యంత దుర్మార్గంగా పాలకులు అణగదొక్కడానికి ఊతం ఇచ్చినది ఈ మనుధర్మ శాస్త్రమే. ఈ క్రమంలో మన ఉపఖండంలో సమాజం ముందుకు పురోగమించకుండా ప్రధాన ఆటంకంగా తయారైనది కూడా ఈ మనుధర్మ శాస్త్రమే.

దీనిని గ్రహించిన అభ్యుదయ వాదులు దేశంలో దాదాపు అన్ని ప్రాంతాల లోనూ వివిధ తరహాల సంస్కరణోద్యమాలను నడిపారు. మన తెలుగునాట కందుకూరి, రఘుపతి వెంకటరత్నం నాయుడు, గురజాడ, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న తదితరులు మనువాదాన్ని ఎదిరించి నూతన అభ్యుదయ సాంప్రదాయాలకు తెర తీశారు. ఆ సంస్కరణోద్యమ ఒరవడిని భారత జాతీయోద్యమం కూడా కొంతమేరకు అందిపుచ్చుకుంది. పూలే, అంబేద్కర్, పెరియార్ వంటి మహనీయులు సంఘానికి పట్టిన మనువాదపు చీడను వదిలించడానికి చాలా గొప్ప కృషి చేశారు. అత్యధికులు ప్రజానీకం సంస్కరణ ఉద్యమాలను స్వాగతించారు ఒక ఆధునిక సమాజంగా మన దేశాన్ని ముందుకు నడిపించాలన్న బలమైన కోరిక జాతీయోద్యమంలో పాల్గొన్న అశేష ప్రజానీకంలో వ్యక్తమైంది. దాని పర్యవసానంగా మన రాజ్యాంగం రూపొందింది.

మన దేశంలో తతిమ్మా ప్రజానీకం అంతా రాజ్యాంగం రూపొంది, ఆమోదం పొందిన రోజున పండుగ చేసుకున్నారు. కాని ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం దానిని ఒక దుర్దినంగా పేర్కొంది. మను ధర్మశాస్త్రం మనకి ఉండగా మళ్ళీ వేరే రాజ్యాంగం ఎందుకన్న వాదనను ఆర్గనైజర్ పత్రిక చేసింది. స్వాతంత్ర్యోద్యమానికి దూరంగా ఉంటూ అప్పటి బ్రిటిష్ పాలకులకు విధేయులుగా వ్యవహరించిన ప్రబుద్ధుల నుంచి వేరే ఇంకేం ఆశించగలం?

ఇప్పుడు ఆ హిందూత్వ శక్తులే అధికారంలో ఉన్నాయి. పేరుకి రాజ్యాంగానికి విధేయులుగా ఉంటాం అని ప్రతిజ్ఞ చేసినా, నిజానికి వాళ్ళకు మనువాదమే ముఖ్యం. సనాతన ధర్మం అంటే వారి దృష్టిలో మను ధర్మమే. ఐతే నేరుగా మను ధర్మాన్ని అమలు చేస్తాం అని చెప్పే సాహసం వారిప్పుడు చేయలేరు. కనుక దానికి బదులుగా సనాతన ధర్మం అన్న పదాన్ని ముందుకు తెచ్చారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, స్వేచ్ఛ, సమానత్వం వంటి భావాలకు వారి దృష్టిలో ఎటువంటి విలువా లేదు.

కాబట్టి సనాతన ధర్మం అన్న పదాన్ని చూసి దీనిని వ్యతిరేకించడం అంటే గతంలో మన సమాజం అప్పటా, అప్పటా సాధించిన విజయాలను వ్యతిరేకించడం అని అనుకోకూడదు. మనం గొప్పగా చెప్పుకునే గతకాలపు ఔన్నత్యం చాలా పరిమితం. ఇప్పుడు పేదరికంతో, అవిద్యతో, నిరుద్యోగంతో, ఆకలితో అలమటిస్తున్న కోట్లాది ప్రజల కడగండ్లను తీర్చి "లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అన్న సనాతన ఆదర్శం నెరవేర్చాలంటే ఈ సనాతన మనువాద ధర్మాన్ని నిలువులోతు గొయ్యి తీసి పాతి పెట్టాల్సిందే. కుల వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిందే. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా" (ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఆనందంగా సంచరిస్తారు) అన్న భావన ఆచరణలోకి రావాలంటే మను వాదానికి, దానిని సమర్ధించేవారికి మన సమాజంలో చోటు లేకుండా తరిమి కొట్టాల్సిందే.

ఈ విషయం మీద చర్చకు తెర తీసినందుకు దయానిధి స్టాలిన్‌ను అభినందించాలి. ఐతే అక్కడితో సరిపోదు. సమాజాభ్యుదయాన్ని కోరే అన్ని శక్తులూ రంగంలోకి రావాలి. చేయి చేయి కలపాలి. యావత్ ప్రజానీకాన్నీ కదిలించాలి.


ఓం శాంతి: శాంతి: శాంతి:

★

సందర్భం

కాలానికి ముందుమాట గురజాడ బాట

కొప్పుల ప్రసాద్



గురజాడ అప్పారావు (1862 సెప్టెంబర్ 21- 1915 నవంబర్ 30) తన రచనల ద్వారా తెలుగు నాట సాంఘిక పరివర్తనకు కృషి చేసిన మహాకవి. 19వ శతాబ్ది ఆఖరిలోనూ, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ ఆయన చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందు తున్నాయి. ఆయన ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసి, ఆనాటి భాషోద్యమానికి కూడా గొప్ప తోడ్పాటునందించారు. ఆనాటి సమాజంలోని అకృత్యాలపై వ్యంగ్యశైలిలో దునుమాడుతూ రాసిన 'కన్యాశుల్కం' నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆయన సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు మొదలైన పాత్రలు ఇప్పటి సమాజంలోనూ దర్శనమిస్తాయి.

కదిలించిన పూర్ణమ్మ

'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' గురజాడ అప్పారావు రచించిన కరుణ రసాత్మక గేయం. ఈ గేయ ఇతివృత్తం కన్యాశుల్కం అనే దురాచారం. నాటి సమాజంలోని కన్యాశుల్కం దురాచారానికి బలవుతున్న బాలికల పట్ల అత్యంత కరుణతో, చిన్నారి బాలికలకు ప్రతినిధిగా పూర్ణమ్మ అనే పాత్రను సృష్టించి కథనాత్మకమైన కావ్యంగా, కరుణరస ప్లావితమైన గేయంగా రూపొందించారు. అందచందాలు రాశిపోసిన ముగ్ధ అయిన ఓ కౌమార బాలిక బతుకు మూఢాచారానికి బలయిన తీరును ఈ కథలో వివరించారు గురజాడ. కొందరు తండ్రులు కన్యాశుల్కానికి ఆశపడి చిన్న వయసులోనే ఆడపిల్లల్ని ముసలి వరులకు కట్టబెట్టడాన్ని ఖండిస్తూ రాసిన ఈ గేయకథ చదువరుల హృదయాలను కదిలించేంత శక్తివంతమైనది.

గిడుగుకు తోడుగా ...

వాడుక భాషోద్యమ కర్త గిడుగు రామమూర్తి, మహాకవి గురజాడ విజయనగరం కళాశాలలో సహాధ్యాయులు. రచనలో, బోధనలో వ్యవహారిక భాష వినియోగించాల్సిన అవసరంపై ఇద్దరిదీ ఒకటే పట్టు. వాడుక భాష కోసం గిడుగు ఎంతగా ఉద్యమించాడో, ఏయే ప్రయోజనాలు ఉంటాయని చెప్పాడో ఆ ప్రయోజనాలను వాడుక భాషలో నాటకం, కవిత్వం, కథలూ రాయడం ద్వారా గురజాడ నిరూపించాడు. ఆ విధంగా వాడుక భాష ఉద్యమానికి గిడుగుకు తోడుగా, సరిజోడుగా నిలిచాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకాన్ని 1890 ప్రాంతంలో పూర్తి వాడుక భాషలో రచించాడు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. 1897లో కన్యాశుల్కం తొలి కూర్పును మహారాజా ఆనంద గజపతికి అంకితమిచ్చాడు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909లో రచించాడు.

1892లో గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీనితో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికింది అని చెప్పవచ్చు. సాంఘిక ఉపయోగంతో పాటు రసజ్ఞుల ఆనందానికి కూడా వాడుక భాష వాడవచ్చని ఈ నాటకం నిరూపించింది. వాడుక భాష ప్రయోగానికి వ్యతిరేకి అయిన కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి కూడా ఈ నాటకం సాహితీ విలువలను ప్రశంసించాడు. నాటకం విజయవంతమై అమిత ప్రజాదరణ పొందడం వాడుక భాషోద్యమానికి ఎంతో దోహదపడింది. 1897లో కన్యాశుల్కాన్ని వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు వారు ప్రచురించారు. 1909 ఆరోగ్యం కుదుట పడడానికి నీలగిరి కొండల్లో గురజాడ విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కన్యాశుల్కం నాటకాన్ని తిరగ రాసాడు. గురజాడ 1910లో రాసిన "దేశమును ప్రేమించుమన్నా" దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందింది.

> అనేక వివక్షలపై, వెనకబాటు భావాలపై, గతమంతా గొప్పదనుకునే వెధవాయతనంపై గురజాడ చాలా స్పష్టంగా, సమరశీలంగా తన అభిప్రాయాలను వెల్లడించాడు. వాటిని అందుకోవాల్సి ఉంది. విద్యావిధానంలో, మహిళలను గౌరవించటంలో, తోటి మనిషిని ప్రేమించటంలో, శ్రమను గౌరవించటంలో, కులమతాలకు దూరంగా మసలటంలో గురజాడ చూపిన వెలుగు దారి ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శనీయం, అనుసరణీయం.

నేడు గురజాడ జయంతి

గురజాడ కాలంలోనే గురజాడను వ్యతిరేకించినవారు కొందరు ఉన్నారు. కొందరు ఆయన ఆధునిక భావాలను జీర్ణించుకోలేకపోయారు. మరికొందరు సాహిత్యపరంగా వాడుక భాషను వినియోగించటాన్ని తప్పు పట్టారు. అయితే, కాలక్రమంలో ఆ రెండు వాదనలూ, నిరసనలూ గాలివాటుగా కొట్టుకుపోయాయి. "కన్యాశుల్కం నాటకానికి సాటి రాగల రచన భారతీయ సాహిత్యంలో మృచ్ఛకటికం తప్ప మరోటి లేదు", "కన్యాశుల్కం బీభత్సరస ప్రధానమైన విషాదాంత నాటకం", "కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ" అని మహాకవి శ్రీశ్రీ పేర్కొన్నాడు. తెలుగు సాహిత్య అభ్యున్నతికి గురజాడ పరిచిన బాటలోనే తాను నడుస్తున్నానని సగర్వంగా ప్రకటించుకున్నాడు.

స్త్రీలకు అగ్ర తాంబూలం

"స్త్రీల కన్నీటి గాథలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటం కూడా ఓ ప్రధాన కారణమే" అని గుర్తించిన గురజాడ, ఎంత ఆధునికుడో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. పీడిత కులాల జీవితాల్లో కూడా ఆ సమస్యకున్న ప్రాధాన్యాన్ని ఆయన గమనించారు. ఆర్థిక స్వాలంబనను కల్పించే ఆధునిక విద్యను అందరికీ అందించాలని గురజాడ ఆశించారు. అందుకు పనికొచ్చే విద్యా ప్రణాళిక గురించి ఆలోచించారు. "పాటక జనాలను అభివృద్ధికి తెచ్చేందుకు పాతబడిన విద్యలు పనికిరావు. వారి స్థితిగతులను చక్కబరచి అభివృద్ధికి తేవడం ప్రజాస్వామిక లక్షణం" అనే స్పష్టత ఆయనకు ఉంది కాబట్టే-"ప్రత్యక్ష జీవితంలో మనం ఎదుర్కొంటున్న విషమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఈ వేద విజ్ఞానం ఒక్క పిసరు అక్కరకు రాదు" అని పేర్కొన్నారు. పాఠ్య ప్రణాళికలో మత సంబంధమైన ప్రాచీన సాహిత్యాన్ని బోధించడం వల్ల యువతరంలో కుల మతాల సంకుచితత్వం ప్రబలుతుందని ఆందోళన చెందారు.

సమాజానికి వెలుగు జాడ

160 ఏళ్ల క్రితం పుట్టి, నూటా ఎనిమిదేళ్ల క్రితమే మరణించిన గురజాడ ఇప్పటికీ మన సమాజానికి వెలుగు జాడ. ఆ దారిలో మనం గమ్యానికి ఇంకా చాలా దూరంలో ఉన్నాం. ఇటీవల ఛాందస, మతోన్మాద భావాల వ్యాప్తి ఆ విజ్ఞాన ప్రయాణాన్ని మరింత మసకబారుస్తోంది. అనేక వివక్షలపై, వెనకబాటు భావాలపై, గతమంతా గొప్పదనుకునే వెధవాయతనంపై గురజాడ చాలా స్పష్టంగా, సమరశీలంగా తన అభిప్రాయాలను వెల్లడించాడు. వాటిని అందుకోవాల్సి ఉంది. విద్యావిధానంలో, మహిళలను గౌరవించటంలో, తోటి మనిషిని ప్రేమించటంలో, శ్రమను గౌరవించటంలో, కులమతాలకు దూరంగా మసలటంలో గురజాడ చూపిన వెలుగు దారి ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శనీయం, అనుసరణీయం. తెలుగువారి వెలుగు జాడ మన గురజాడ. నవ్య కవిత్వానికి వేగుచుక్కలా నిలిచి, మూఢనమ్మకాలను ఎదిరించి సత్యము బోధించి శాస్త్ర జ్ఞానాన్ని సమూలంగా అభ్యసించాలని చాటిన క్రాంతదర్శి. "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుజులోయ్" అన్న పిలుపు ఇప్పుడు మరింతగా మననం చేసుకోవాల్సినది. అక్షరక్షరం పాటించి తీరాల్సినది. ఆ మహానుభావుడి మాటల బాటలో చెట్టపట్టాల్ పట్టుకొని నడవడమే మనమందరం ఆయనకిచ్చే ఘన నివాళి!

వ్యాసకర్త తెలుగు ఉపన్యాసకులు,
సెల్ : 98850 66235

జన వాక్యం

ఖద్దరు ధరిద్దాం

మన పూర్వీకులు ఎక్కువగా ఖాదీ ధరించడానికి మొగ్గు చూపేవారు. మహాత్ముడి పిలుపుతో అప్పటి ప్రజానీకం ఖాదీ ధరించడాన్ని హుందాగా, రాజసంగా భావించడమే గాక దేశభక్తికి చిహ్నంగా భావించేవారు. కానీ కాలక్రమేణా ఖాదీ బట్టల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. దీంతో ఒక్కసారిగా చేనేత కార్మికుల జీవితాలు అస్తవ్యస్తంగా తయారయి, చివరకు వారి ఉనికే ప్రశ్నార్థకంగా మారే దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది. చేనేత రంగానికి తిరిగి పూర్వపు వైభవాన్ని తీసుకువచ్చేలా మన వంతుగా గట్టి ప్రయత్నాలు ప్రారంభిద్దాం. ఖద్దరు ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహిద్దాం. అంతేగాక చేనేత కార్మికుల జీవితాలలో వెలుగు నింపేలా మన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వారి జీవితంలో కమ్ముకున్న కారుచీకట్లు తొలగుతాయి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాల.

మేధావులారా నోళ్లు విప్పండి ...

ప్రజలు కష్టాలలో ఉన్నపుడు ప్రభుత్వాలకు సలహాలు ఇచ్చి, ఆ కష్టాల నుండి ఎలా గట్టెక్కించాలా అని మేధావులు ఆలోచించాలి. మరి ఈ రోజు ఎన్నడూ లేనివిధంగా దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలు ఉన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశం మతోన్మాద ఊబిలోకి కూరుకుపోతుంది. రాష్ట్రం అమ్మకానికి పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. దేశ ప్రధానికి మతం పట్ల, దేవుని పట్ల ఉన్న ప్రేమ ప్రజల పట్ల లేదని చాలా సంఘటనలు రుజువు చేస్తున్నాయి. మొన్న నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ సమయంలో ఎన్నడూ లేని విధంగా సన్యాసులను లోపలికి ఆహ్వానించి, వారికి దేశ ప్రధాని సాష్టాంగ పడటం, బిజెపి నాయకులు ఆవుకు, ఆవు పేడకు మహిమలు కల్పించటం దేశాన్ని వెనకకు తీసుకెళ్లటం కాదా! టెలికం, రైల్వేలను, పోర్టులను, విమానాశ్రయాలను కేంద్రం ప్రైవేటుపరం చేస్తున్నది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం లేక ఉన్న ఆస్తులను తాకట్టు పెట్టడం, కలెక్టరు కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలను అమ్మటం, ప్రభుత్వ ఖాళీ స్థలాలను అమ్మటం చేస్తోంది. ప్రశ్నిస్తే కేసులు, జైళ్ళు, అరెస్టులు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం, దేశం ఉంటే మేధావులు ఏం చేస్తున్నారు? గమ్మున వుంటే రాబోయే తరం మిమ్ములను తిట్టుకుంటుంది. కనుక ముఖ్యంగా రాష్ట్రంలోని మేధావులు నోళ్ళు విప్పి పరిష్కారం చూపించండి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

ముందు జనగణన... ఆ తర్వాత పునర్విభజన

ఇవి జరిగితేనే చట్టసభలలో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ ఈ బిల్లును అన్ని పక్షాలూ సమర్థిస్తున్న నేపథ్యంలో రాజ్యసభలోనూ దీనికి ఆమోదం లభించడం కష్టమేమీ కాదు. అయితే చట్టసభలలో మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావాలంటే ముందుగా జనగణన తప్పనిసరి. రెండు సంవత్సరాల క్రితం అంటే 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తోంది. జనగణన జరిగి, దాని ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజ ప్రక్రియ పూర్తయితేనే మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగాల్సి ఉంది. కాబట్టి దానికి ముందే జనగణన కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. ఇక్కడ మరో విషయాన్ని కూడా గమనించాల్సి ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఉభయసభలు ఆమోదం తెలిపినప్పటికీ రాష్ట్రాల శాసనసభలు కూడా వేర్వేరుగా తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. ఈ కసరత్తు పూర్తి కావాలంటే 2029 లోక్‌సభ ఎన్నికల వరకూ వేచి చూడక తప్పదు. అప్పుడే చట్టసభలలో మెరుగైన ప్రాతినిధ్యం కోసం మహిళలు కన్న కలలు నిజమవుతాయి.

2011లో చివరిసారిగా జనగణన జరిగింది. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలను సేకరించాల్సి ఉంది. కానీ కోవిడ్ కారణంగా 2021లో ఆ పని జరగలేదు. కోవిడ్ ప్రభావం తగ్గి, జనజీవనం సాధారణ స్థాయికి చేరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం జనగణన ఊసే ఎత్తడం లేదు. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జిఐ) ఇటీవల జారీ చేసిన రెండు నోటిఫికేషన్లలోనూ జనగణన ఆలస్యం కావడానికి కారణాలు వివరించలేదు. జూన్ 30న అదనపు ఆర్‌జిఐ ఓ ఆదేశాన్ని జారీ చేశారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉండగా ఆ లోగా నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశమే లేదని అందులో తేల్చి చెప్పారు.

దాటవేత సమాధానాలు

జిల్లాలు, తాలూకాలు, ఉప-జిల్లాలు, రెవెన్యూ గ్రామాలు, మున్సిపాలిటీలు, పోలీస్ స్టేషన్లు, పట్టణాలకు సంబంధించిన పాలనాపరమైన సరిహద్దులను నిర్ణయించే ప్రక్రియ 2020 నుండి ఎనిమిది సార్లు వాయిదా పడింది. ఈ ప్రక్రియ గడువును ప్రతి 3-6 నెలలకు ఒకసారి పొడిగిస్తూనే ఉన్నారు. సాధారణంగా జనగణనకు ముందు ఈ ప్రక్రియను నిలిపివేస్తారు. పాలనాపరమైన సరిహద్దులు నిర్ణయించాలంటే ఎన్యూమరేటర్లుగా నియమితులయ్యే ప్రభుత్వోద్యోగులకు కనీసం మూడు నెలల సమయం అవసరమవుతుంది. జనగణన ఆలస్యానికి కారణమేమిటని మంత్రులు, అధికారులను ప్రశ్నిస్తే సమాధానాలు



దాటవేస్తున్నారు. కేంద్ర హోం శాఖ అధికారిని అడిగితే 'మేము అన్నివిధాలా సన్నద్ధంగా ఉన్నాము. అంతా సిద్ధం. కానీ రాజకీయ నిర్ణయం జరగాల్సి ఉంది' అని బదులిచ్చారు. జనగణన కసరత్తుపై ఒక సీనియర్ కేంద్ర మంత్రిని కదిలిస్తే 'నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రకటిస్తాం. నోటిఫై చేస్తాం. దేనినీ రహస్యంగా ఉంచం' అని చెప్పుకొచ్చారు.

రాష్ట్రాల ప్రాతినిధ్యంపై అనుమానాలు

లోక్‌సభలో స్థానాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే జనగణన పూర్తయిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఈ ప్రక్రియలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం దక్కదేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజించడం, కేంద్ర నిధులలో రాష్ట్రాల వాటాను నిర్ణయించడం వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. దీంతో దక్షిణాదిన శిశు జననాలు తగ్గిపోతున్నాయి. ఫలితంగా జనాభాలో పెరుగుదల కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు అనుమానిస్తున్నాయి.

కాలం చెల్లిన సమాచారంతో...

వివిధ ప్రభుత్వ పథకాల అమలు కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న సమాచారానికి ఎప్పుడో కాలం చెల్లిపోయిందని మాజీ డిప్యూటీ ఆర్‌జిఐ కె.నారాయణన్ ఉన్ని చెప్పారు. 'ఆహార భద్రతా చట్టం కింద లబ్దిదారులను ఎంపిక చేసేందుకు కాలం చెల్లిన 2011 జనగణన సమాచారాన్నే ఉపయోగిస్తున్నారు. దీంతో దేశంలో పది కోట్ల మందికి ఆహార భద్రత లభించడం లేదు. అప్పటి జనగణన లెక్కల ఆధారంగానే ఎన్ఎస్ఎస్, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ వంటి సర్వేలు నిర్వహించడం వల్ల విశ్వసనీయ అంచనాలు రావడం లేదు. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో మహిళల అక్షరాస్యత చాలా తక్కువగా ఉంది. జనగణన జరిపితే ఇలాంటి గ్రామాలను గుర్తించి, మెరుగైన ఫలితాలు సాధించడానికి కార్యక్రమాలను రూపొందించుకోవడం సాధ్యపడుతుంది' అని ఆయన వివరించారు.

బిజెపి అమలు చేయదు : నితీష్ కుమార్

పాట్నా : మహిళా రిజర్వేషన్ బిల్లును మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయదని బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆరోపించారు. బుధవారం పాట్నాలో నితీష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే మోడీ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లును వారు అమలు చేయరు. వారు అలా చేయాలనుకుంటే దానిని ముందే చేసి ఉండేవారు. మహిళా రిజర్వేషన్ అవసరమని, మేము మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నాం. దాన్ని అమలు చేయడం లేదు' అన్నారు.

మహిళా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ అమలులోకి తీసుకువచ్చింది. ఫలితంగా స్థానిక సంస్థల్లో ఇప్పటివరకు 15 లక్షల మంది మహిళలకు ప్రాతినిధ్యం దక్కిందని చెప్పారు. అంతకు ముందు మాట్లాడిన కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లుకు ఎన్డీయే ఎంపిలందరూ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.

ఇంకా ఎంతకాలం : కనిమొళి

డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడుతూ 'మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇంకెంతకాలం ఎదురుచూడాలి' అని ప్రశ్నించారు. తక్షణమే బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు నారీ శక్తి వందన్ అధినియమ్ అని పేరు పెట్టారు. మాకు సెల్యూట్ చేసి వందనాలు చేయనక్కర్లేదు. పీఠాలు వేసి పూజలు చేయాల్సిన అవసరం లేదు. సమానంగా గౌరవిస్తే చాలు' అని చెప్పారు.

అసంపూర్తిగా ఉంది : రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ఇది (మహిళా రిజర్వేషన్ బిల్లు) ఒక పెద్ద అడుగు. మన దేశంలోని మహిళలకు ఇది చాలా ముఖ్యమైన దశ అని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. అయితే నా దృష్టిలో ఒక అంశం ఉంది. ఈ బిల్లును అసంపూర్తిగా ఉంది, ఈ బిల్లులో ఓబిసి రిజర్వేషన్‌ను చేర్చాలని నేను కోరుకుంటున్నాను" అని తెలిపారు.

ఎన్నికలు ముగిసిన వెంటనే జనగణన

2024 ఎన్నికలు ముగిసిన వెంటనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది కొన్ని పార్టీలకు రాజకీయాంశమని అన్నారు. 'ఈ బిల్లును గతంలో నాలుగుసార్లు తెచ్చినప్పటికీ ఆమోదం పొందలేదు. దేవేగౌడ హయాంలోనూ మహిళా రిజర్వేషన్ బిల్లు తెరపైకి వచ్చింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ విపక్షంలో ఉంది. ప్రధాని మోడీ కృషితోనే ఈ బిల్లు సాధ్యమయ్యింది.' అని అన్నారు.

ఎన్నికలకు 'ఉక్కు' అజెండా

(మొదటి పేజీ తరువాయి)

వంటి అధిపతుల్లో ఎవరికి అమ్ముదామా? అన్న యావ మోడీలో ఎక్కువైందని దుయ్యబట్టారు. స్టీల్‌ప్లాంట్ ఇచ్చిన భూముల్లో గంగవరం పోర్టు ఏర్పాటు చేసి ఇప్పుడు అదానీ పరం చేసి కార్మికులను హింస పెట్టడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్ద ఎత్తున ఉద్యమిస్తోందన్నారు.

బైక్ యాత్రకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజా యాత్రగా ఉక్కు రక్షణ బైకు యాత్ర సాగనుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ నెల 29 వరకూ పది రోజులపాటు 1,150 కిలోమీటర్లు కొనసాగనుందని తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడంతో అధిక భారం మోయాల్సి వస్తోందన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, ఐఎన్‌టియుసి నాయకులు రామచంద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బైకుయాత్ర

ఈ బైకు యాత్రకు రథసారథిగా ఉన్న కె.లోకనాథానికి ముందుగా వి.శ్రీనివాసరావు పార్టీ కండువా వేసి జెండా ఊపి బైకు యాత్రను ప్రారంభించారు. అనంతరం ద్వారకానగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, తగరపువలస మీదుగా విజయనగరానికి బైకు యాత్ర చేరుకుంది.

చంద్రబాబు అరెస్టు తీరు అభ్యంతరకరం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడును అరెస్ట్ చేసిన తీరు అభ్యంతరకరమని వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ విధంగా అరెస్టు చేయడం కక్షసాధింపు అని, అందుకు ఆస్కారం లేకుండా అవినీతిపై విచారణ కొనసాగించి దోషులను శిక్షించాలని అన్నారు. ఉక్కు రక్షణ బైక్ యాత్రను ప్రారంభించేందుకు బుధవారం విశాఖ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతున్నప్పుడు 'చంద్రబాబు అరెస్టును మీ పార్టీ ఎలా చూస్తుంది?' అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.

పిల్లలకు పెద్దల ఛార్జీ


- ఏడేళ్లలో రైల్వేకు రూ. 2800 కోట్లు ఆదాయం

న్యూఢిల్లీ : రైళ్లలో చిన్నారుల ప్రయాణానికి సంబంధించిన సవరించిన నిబంధనల కారణంగా భారతీయ రైల్వేకు రూ.2800 కోట్లు అదనపు ఆదాయం సమకూరింది. సవరించిన నిబంధనలు అమల్లోకి వచ్చి ఏడేళ్లు కాగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.560 కోట్లు వచ్చినట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ విషయం ఒక ఆర్‌టీఐ దరఖాస్తుకు రైల్వే శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఇచ్చిన సమాచారం ద్వారా వెల్లడయింది. రైళ్లలో ఒకప్పుడు 5-12 ఏళ్ల చిన్నారులకు సపరేట్ బెర్త్ ఎంచుకున్నా టికెట్ ధరలో సగం మాత్రమే వసూలు చేసేవారు. అయితే 2016 మార్చి 31న కొత్త నిబంధనలను రైల్వే శాఖ ప్రకటించింది. సపరేట్ బెర్త్/ సీటు ఎంచుకుంటే పెద్దల్లానే పిల్లలకూ పూర్తి టికెట్ ధర వర్తిస్తుందని తెలిపింది. ఒకవేళ సెపరేట్ బెర్త్ వద్దనుకుంటే హాఫ్ టికెట్ వర్తిస్తుంది. ఈ నిబంధనలు 2016 ఏప్రిల్ 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 2016-17 నుంచి 2022-23 వరకు వివిధ ఆర్థిక సంవత్సరాల్లో రైల్వే శాఖ రూ 28 00 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడేళ్లలో ఫుల్ ఫేర్ చెల్లించి సపరేట్ బెర్త్/ సీట్‌ను వినియోగించుకుని 10 కోట్ల మంది చిన్నారులు ప్రయాణించినట్లు రైల్వే శాఖ తెలిపింది. 3.6 కోట్ల మంది మాత్రమే హాఫ్ టికెట్ ధర చెల్లించినట్లు పేర్కొంది. అంటే రైళ్లలో ప్రయాణించే చిన్నారుల్లో 70 శాతం మంది ఫుల్ టికెట్ చెల్లించే ప్రయాణిస్తున్నట్లు వెల్లడైందని ఆర్‌టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ పేర్కొన్నారు. దూర ప్రయాణాలు చేసే వారు సపరేట్ బెర్త్ వినియోగించుకుంటున్నారని, దీనివల్ల రైల్వేకు అదనపు ఆదాయం సమకూరిందని చెప్పారు.

రాజ్యాంగ పీఠిక నుండి 'సెక్యులర్, సోషలిస్ట్' పదాలను తొలగించారు

- కాంగ్రెస్ ఎంపి అధిర్ రంజన్

న్యూఢిల్లీ : రాజ్యాంగ పీఠిక నుండి సెక్యులర్, సోషలిస్ట్ పదాలు తొలగించారని కాంగ్రెస్ ఎంపి అధిర్ రంజన్ చౌదరి బుధవారం ఆరోపించారు. పార్లమెంట్ నూతన భవనం ప్రారంభ రోజు సందర్భంగా మంగళవారం ఎంపిలకు అందజేసిన రాజ్యాంగం యొక్క కాపీల్లో ఆ పదాలు లేవని కాంగ్రెస్ ఎంపి తెలిపారు. సామ్యవాదం(సోషలిస్టు), లౌకికవాదం(సెక్యూలర్) పదాలు.. రాజ్యాంగ పీఠికలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొత్త పార్లమెంట్ భవనం తొలి రోజు సందర్భంగా జరిగిన సమావేశాల సమయంలో.. ఎంపీలకు రాజ్యాంగం పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం అందజేసిన విషయం తెలిసిందే. పీఠికలో సెక్యూలర్, సోషలిస్టు పదాలను తెలివిగా తొలగించారని, బిజెపి ప్రభుత్వ ఉద్దేశాలపై అధిర్ రంజన్ చౌదరి అనుమానాలను వ్యక్తం చేశారు. 'ఇది తీవ్రమైన విషయం,



ఈ అంశాన్ని మేం లేవనెత్తుతాం' అని విలేకరులతో అధిర్ చౌదరి తెలిపారు. 1976లో సవరణ ద్వారా పీఠికలో సెక్యులర్, సోషలిస్టు పదాలను చేర్చారు. '1976లో రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిస్ట్ పదాలను పీఠికలో చేర్చారనే విషయం తనకూ తెలుసునని, కానీ తాజాగా ఇచ్చిన రాజ్యాంగం పుస్తకాల్లో ఆ పదాలు లేకపోవడంతో ప్రభుత్వం ఉద్దేశం అనుమానాస్పదంగా ఉంది' అని అధిర్ రంజన్ చౌదరి చెప్పారు.

లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లపై పరిశీలన

- నవంబర్ 21 నుంచి సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్‌సిలకు, ఎస్‌టిలకు సీట్లు రిజర్వేషన్‌కు మంజూరు చేసిన క్లాక్ వర్క్ (సమయానుకూలంగా) పొడిగింపులు రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం బుధవారం నిర్ణయించింది. జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ జెపి పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలు కూడా ఉన్న ధర్మాసనం నవంబర్ 21 నుంచి దీనిపై విచారణ చేయనుంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి పదేళ్ళ పాటు మాత్రమే ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ వుండాలని అంబేద్కర్ నేతృత్వంలోని రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీ ఉద్దేశించింది.

అయితే, అప్పటి నుండి దశాబ్దాల కాలం పాటూ రాజ్యాంగంలోని 334వ అధికరణను పలుసార్లు సవరిస్తూ వచ్చారు. సవరించిన ప్రతీసారి పదేళ్ల అంతకన్నా ఎక్కువ కాలం పొడిగిస్తూ వచ్చారు. 1969లో రాజ్యాంగం (8వ సవరణ)తో మొదలు పెడితే, 2019లో రాజ్యాంగం (104వ సవరణ) వరకు పదే పదే గడువు పొడిగించబడుతూ వచ్చింది. 2030 కల్లా ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీలు 80ఏళ్ల నుండి రిజర్వేషన్ సదుపాయాన్ని అనుభవించి వుంటాయి. కేవలం చట్టసభల్లో ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీలకు రిజర్వేషన్ కొనసాగించడం కోసమే 334వ అధికరణను పదే పదే సవరించడానికి రాజ్యాంగ అధికారాన్ని పార్లమెంట్ ఉపయోగించుకోవచ్చా లేదా అని పరిశీలించాలని రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించింది.

ఇస్లామిక్ డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘిస్తే పదేళ్ళ జైలు !

- బిల్లును ఆమోదించిన ఇరాన్ పార్లమెంట్

టెహరాన్ : ఇస్లామిక్ డ్రెస్ నిబంధనలను ఉల్లంఘించిన మహిళలకు పదేళ్ళ వరకు జైలు శిక్షతో సహా కఠినమైన శిక్షలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లును బుధవారం ఇరాన్ చట్టసభ సభ్యులు ఆమోదించారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియా తెలిపింది. "సపోర్ట్ ఫర్ ది కల్చర్ ఆఫ్ హిజాబ్ అండ్ చాస్టిటీ' బిల్లును మూడేళ్ళ ట్రయల్ పీరియడ్‌తో ఇరాన్ పార్లమెంట్ ఆమోదించిందని అధికార ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. గత ఏడాది సామూహికంగా ఆందోళనలు జరిగినప్పటి నుండి ఇరాన్‌లో మహిళలు డ్రస్ కోడ్‌ను ఉల్లంఘించడం బాగా ఎక్కువైంది. దీంతో అధికారులు, పోలీస్తు గస్తీ బృందాలు ఇటీవలి మాసాల్లో చర్యలను ముమ్మరం చేశారు. డ్రెస్ కోడ్‌ను నీరు గార్చిందనే కారణంతోనే 22ఏళ్ళ మాషా అమినిని అరెస్టు చేయగా, ఆమె కస్టడీలో వుంటుండగా మరణించింది. దాంతో ఇరాన్‌వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వందలాదిమంది మరణించారు. వీరిలో డజన్ల సంఖ్యలో భద్రతా సిబ్బంది కూడా వున్నారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ముసాయిదా చట్టం ప్రకారం, తలకు స్కార్ఫ్‌ను ధరించకపోతే మహిళలకు ఐదు నుండి పదేళ్ళ వరకు జైలు శిక్ష పడుతుంది.

రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా బైడెన్

ఆహ్వానించిన మోడీ

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ఆహ్వానించారు. అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటి ఈ విషయాన్ని బుధవారం వెల్లడించారు. అయితే ఆ సమయంలో అమెరికన్ కాంగ్రెస్ సమావేశాలు జరుగుతాయని, అందుకే ఆ ఆహ్వానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్వాడ్ సదస్సు కోసం వచ్చే ఏడాది బైడెన్ భారత్‌లో పర్యటించాల్సి వుంది. అదే సమయంలో ఇండో-పసిఫిక్ క్వాడ్రిలేటరల్ గ్రూపు సమావేశం జరిగేలా చూసేందుకు జపాన్, ఆస్ట్రేలియా ప్రభుత్వాలతో కూడా మాట్లాడాలని భారత్ ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు తెలిపాయి.

జి-20సదస్సుకు ముందుగా మోడీ, బైడెన్‌ల ద్వైపాక్షిక సమావేశం జరిగిన సమయంలోనే, ప్రధాని మోడీ ఈ ఆహ్వానాన్ని అందచేశారని గార్సెటి తెలిపారు. అయితే ఆ సమయంలో క్వాడ్ సదస్సు గురించి ఆయన ప్రస్తావించలేదని అన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ ఉత్సవాలకు రావాల్సిందిగా బైడెన్‌ను మోడీ ఆహ్వానించడం ఇది మూడవసారి. ప్రతి ఏటా ఈ ఆహ్వానం వేర్వేరు దేశాలకు వెళుతుంది. 2015లో మొదటిసారిగా అమెరికా అధ్యక్షుడు ఒబామా ముఖ్య అతిథిగా విచ్చేశారు. 2018లో అప్పటి అధ్యక్షుడు ట్రంప్ ఆనాటి ఆహ్వానాన్ని తిరస్కరించారు. తాజాగా ఇప్పుడు బైడెన్‌ను ఆహ్వానించారు. అది పరిశీలనలో వుంది.

మరోసారి 'కాశ్మీర్'ను లేవనెత్తిన ఎర్డోగాన్

వాషింగ్టన్ : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో టర్కిష్ అధ్యక్షులు ఎర్డోగాన్ మరోసారి కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. ఐరాస 78వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18న ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకూ జరగనున్నాయి. ఈ సమావేశాలకు హాజరైన ఎర్డోగాన్ ప్రసంగిస్తూ భారత్- పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న కాశ్మీర్ వివాదాన్ని ప్రస్తావించారు. 'భారత్-పాకిస్థాన్‌లకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా.. కాశ్మీర్ విషయంలో ఇరు దేశాల మధ్య వివాదం కొనసాగుతోంది. నిజంగా ఇది దురదృష్టకరం. ఈ విషయంలో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనడం ఎంతో కీలకం. ఇది దక్షిణాసియాలో శాంతి, సుస్థిరతకు బాటలు వేస్తుంది. రెండు దేశాలు చర్చలు జరపాలి' అని ఎర్డోగాన్ అన్నారు. అలాగే ఐరాస భద్రతా మండలిలో 20 దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని కోరారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు ఉన్నాయని.. ఆ ఐదు దేశాలు (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యా) మాత్రమే ప్రపంచం కాదని వ్యాఖ్యానించారు. మరో 15 దేశాలకు కూడా రోటేషన్ విధానంలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని ఆయన సూచించారు.



మీకోసం

బెండకాయ కూర చేయడానికి ముందు ముక్కలపైన కాస్త నిమ్మరసం చల్లితే జిగురు ఉండదు.

జీవన సౌరభం

మనిషి సాధించిన విజయాలు సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలి. అదే ఏ విజయానికైనా అసలైన ప్రయోజనం.

సమీకృత ఆహారం



పాలు, క్యారెట్, గుడ్లు చేపలు
విటమిన్ 'ఎ'కు నిలయాలు
అవి తింటే కంటికి ఎంతో మేలు

అన్నం, రొట్టె, పాలు, మాంసాలు
విటమిన్ 'బి'కు దోహదం
తగ్గించును రక్త హీనతలు

నారింజ, నిమ్మ, టమాటాలు
విటమిన్'సి'కు కారకాలు
పెంచును రోగనిరోధక శక్తి


పాలు, గ్రుడ్లు, సూర్యరశ్మి
విటమిన్ 'డి' మెండు
దృఢంగా ఉంటాయి ఎముకలు

కాయగూరలు, మొలకెత్తే గింజలు
విటమిన్ 'ఇ' అందిస్తాయి
వృద్ధి చెందేను ఎర్ర రక్తకణాలు

పాలు, ఆకుకూరలు, కాయగూరలు
అందేను విటమిన్ 'కె'
గడ్డకట్టును రక్తం చిందే గాయాలు

ఎ, బి, సి, డి, ఇ, కె విటమిన్లు
పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రొటీన్లు
ఇవన్నీ కలిస్తే సమీకృత ఆహారం
అందించును సంపూర్ణ ఆరోగ్యం

- ద్వారపురెడ్డి జయరామనాయుడు
9441519570



దారి చూపండి

చిన్నారులూ, ఇక్కడ ఉన్న రెడ్ కారు, బ్లూ కారుని చేరాలి. అక్కడి వరకూ మీరు డ్రైవ్ చేస్తారా మరి!

నేను గీసిన బొమ్మ



- పవని కృష్ణ ప్రణయిని
5వ తరగతి
చైతన్య స్కూలు
చీరాల



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆత్మ విశ్వాసమే ఆమె బలం..



కేవలం స్పర్శతోనే అక్షరాలను గుర్తు పట్టి.. చదివేందుకు వీలుగా అంధులకు ఓ లిపిని కనిపెట్టారు లూయిస్ బ్రెయిలీ. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఎందరో అంధులు చదువుకుంటున్నారు. అనేక ఉన్నత పదవులను చేపట్టి తాము ఎవరికీ ఏ విధంగా తీసిపోని స్థాయికి ఎదుగుతున్నారు. అందుకు ఉదాహరణగా నిలుస్తున్నారు పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం పెద అమిరం మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దొండపాటి ప్రసన్న భారతి. ఆమె పుట్టుకతోనే అంధురాలు. పట్టుదలతో చదువుకున్నారు. దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి, ఉపాధ్యాయినిగా వృత్తిలో చేరి, ఇప్పుడు ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెతో పాటు పాఠశాలలో పనిచేసే మిగతా ఉపాధ్యాయులంతా కళ్లు ఉన్న వారే.. ఈమె ఒక్కరే అంధత్వంతో ఉన్నారు. అయితేనేం ఆత్మ విశ్వాసంతో తాను నేర్చుకున్న అంధుల లిపితో ఏదైనా ఇట్టే గుర్తు పట్టేయగలరు. లోపాలుంటే వెంటనే చెప్పేస్తారు. సరిచేయాలని సూచిస్తారు.

సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించొచ్చునని నిరూపించారు ప్రసన్న భారతి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ప్రాంతానికి చెందిన డాక్టర్ డి.చంద్రయ్య (రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్), తల్లి సరోజినీ దేవిలకు ఆరో సంతానంగా ప్రసన్నభారతి జన్మించారు. పదో తరగతి వరకు ఆంధ్రా బ్లైండ్ మోడల్ స్కూల్లో చదివారు. ఇంటర్ నరసాపురంలో, డిగ్రీ రాజమండ్రి వైఎన్ కాలేజీలో, బిఇడి అద్దేపల్లి మహాలక్ష్మి కాలేజీలోపూర్తి చేశారు. తరువాత ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఎ చదివారు. 2004లో ఉపాధ్యాయురాలిగా నియమితురాలై దెయ్యాల తిప్ప పాఠశాలలో పనిచేశారు. తరువాతమొగల్తూరు, దేవునితోట పాఠశాలల్లో విద్యాబోధన చేశారు. ఉద్యోగోన్నతిపై పెద అమిరం మెయిన్ ప్రాథమిక పాఠశాలకు



బదిలీ అయ్యి ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు.

పుట్టుకతోనే అంధురాలు

ప్రసన్న భారతికి పుట్టినప్పటి నుంచే కంటి చూపు లేదు. పాఠశాల వయసు వచ్చాక తల్లిదండ్రులు ఆమెకు అంధుల ప్రత్యేక పాఠశాలలో బ్రెయిలీ లిపిలో చదువు కొనసాగించారు. తల్లిదండ్రుల సహకారం, వారిచ్చిన ఆత్మవిశ్వాసం భారతిని ముందుకు నడిపించాయి. ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా వారు కుమార్తెని నిరంతరం ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించారు. చదువులో మామూలు విద్యార్థులతో పోటీ పడిన ప్రసన్న భారతి ఏ రోజూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఉద్యోగం వచ్చాక వివాహమైంది. భర్త సహాయంతో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. శరీరంలో అన్ని అంగాలు సక్రమంగా ఉన్నా ఏమీ చేయలేమని, తల్లిదండ్రులకు భారంగా మారుతున్న ఎంతో మంది యువత ఉన్న నేటి రోజుల్లో, అన్నింటిలోకి ప్రధానమైన కళ్ళు లేకున్నా, పట్టుదల, సంకల్పబలం ఉంటే ఏదైనా సాధించొచ్చునని నిరూపించిన ప్రసన్న భారతి ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

ఆంగ్లంపై ఆసక్తి పెంచుతూ ...

ప్రసన్న భారతి విద్యాబోధనలో ఎంతో సృజనాత్మకంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల అంతర్గత నైపుణ్యాలు, వ్యక్తిగత, తరగతి గది సామర్థ్యాలను వెలికితీయడం, ఆంగ్లంపై ఆసక్తి పెంచుకునేలా కృత్యాధార బోధనను అవలంబిస్తున్నారు. పలు రకాల కృత్యాలు తయారు చేయడం.. వాటిని తరగతి గదిలో ప్రదర్శించడం.. విద్యార్థులతో స్వయంగా తయారు చేయించడం ఆమె ప్రత్యేకత. ప్రాథమిక విద్యార్థులు భవిష్యత్తులో రాణించేందుకు ఆటలు, పాటలు, చిత్రాలతో బోధన చేస్తున్నారు. పాఠ్య పుస్తకాల్లోని బొమ్మలు గీయించడం, గేయాలు రాయించడం, చదవడం, రాయడం అనే ప్రక్రియలతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సమాజం, జీవనం, పర్యావరణం, టెక్నాలజీ, చరిత్ర, పరిశుభ్రత వంటి వాటితోపాటుగా మనిషి జీవన విధానానికి అవసరమయ్యే విషయాలను కథల రూపంలో బోధిస్తున్నారు. ఆమె వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎంతో మంది విద్యార్థులు నవోదయ పరీక్షలకు ఎంపికయ్యారు. హెచ్ఎంగా నాడు-నేడు పనులను సమర్థవంతంగా నిర్వహించారు. దాతల సహకారంతో పుస్తకాలు, బ్యాగులు, టైలు, గుర్తింపుకార్డులు వంటివి అందించటానికి తనవంతుగా కృషిచేస్తున్నారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. బైర్రాజు ఫౌండేషన్ సాయంతో కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు.

సృజనాత్మక శక్తుల వెలికితీతకు ప్రాధాన్యం

2004లో దెయ్యాలతిప్పలో ఉపాధ్యాయినిగా విధుల్లో చేరిన ప్రసన్నభారతి విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులను వెలికితీయటానికి నిరంతరం కృషిచేస్తున్నారు. వారిలో ఆల్‌రౌండ్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. ప్రాథమికస్థాయి పిల్లల్లో భాషాభివృద్ధికి కృషి చేయడంతో ప్రశంసాపత్రాన్ని కూడా అందుకున్నారు. బోధనోపకరణాలతో విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారు. ప్రసన్న భారతికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్నారు. సంకల్పం జిల్లా బెస్ట్ స్కూలు అవార్డులను మూడుసార్లు సాధించారు. తాను కళ్లతో చూడని ప్రపంచాన్ని తన విద్యార్థులకు సచిత్రంగా, సమగ్రంగా పరిచేయం చేస్తూ ... వారి అభ్యున్నతికి తోడపడుతున్న ప్రసన్న భారతి కృషి అభినందనీయం.

- గొట్టేటి శ్రీనివాసులు
ప్రజాశక్తి కాళ్ళ విలేకరి, పశ్చిమ గోదావరి జిల్లా

మరింత బాధ్యత పెరిగింది




ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాను. అంధురాలనే భయంగానీ, బాధగానీ లేదు. పుట్టుకతో వచ్చిన సమస్యను తల్లిదండ్రుల సహకారంతో అధిగమించాను. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి నావంతుగా కృషిచేస్తున్నాను. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో నా బాధ్యత మరింత పెరిగింది. వందేళ్ళ చరిత్ర కలిగిన పాఠశాల్లో పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఉపాధ్యాయ బాధ్యతలు నూరుశాతం నిర్వర్తించడానికి శాయశక్తుల కృషి చేస్తున్నాను.

- దొండపాటి ప్రసన్నభారతి

ఎఎన్నార్ ఓ నట విశ్వ విద్యాలయం

శతజయంతి ఉత్సవాల ప్రారంభంలో వెంకయ్య నాయుడు



అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కినేనితో తనకు ఉన్న అనుబంధాన్ని వెంకయ్య నాయుడు గుర్తుచేసుకున్నారు. 'నాకు నాగేశ్వరరావు అంటే చాలా అభిమానం. ఈ విగ్రహంలో జీవకళ ఉట్టిపడుతోంది. ఆయనే నిల్చున్నారా అనేలా ఉంది. ఏఎన్నార్ మహానటుడు. అలాగే గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహా మనిషి. నేను, ఆయన అనేక విషయాలపై మాట్లాడుకునే వాళ్లం. ఆఖరి రోజు వరకూ నటించిన నటుడు నాకు తెలిసి మరొకరు లేరు. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు. ఆయన చూపిన మార్గంలో ప్రయాణించడం ఆయనకు మనమిచ్చే నివాళి' అని పేర్కొన్నారు. అక్కినేని నుండి స్ఫూర్తి పొంది కొంతైనా అందరూ అమలు పరిస్తే వారి జీవితాలు బాగుంటాయని వెంకయ్య నాయుడు అన్నారు. ఇప్పుడు వస్తున్న సినిమాల్లో అశ్లీలం, రెండర్థాల భావాలు ఉంటున్నాయని విమర్శించారు. తెలుగు భాషని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తుచేశారు. 'భాష పోతే శ్వాస పోతుంది, శ్వాస పోతే, అసలే పోతుంది అందుకే భాషని ఎప్పుడూ మరిచిపోకూడదు. భాష పోతే సినిమా ఉండదు, భాషా పత్రికలూ వుండవు, ఛానళ్ళు వుండవు, భాషని కాపాడుకోవాలి, జీవితంలో అదొక అలవాటుగా, పట్టుదలగా భాషను కాపాడుకోవాల్సి వుంది, దానికి మనం ఏమీ కష్టపడాల్సిన పనిలేదు, మన భాషలో మాట్లాడితే చాలు' అని అన్నారు. ఏ రంగంలో వున్నా కొన్ని విలువలు పాటించాలన్నారు. విలువలకి సజీవ దర్పణం అక్కినేని నాగేశ్వర రావు అని గుర్తుచేశారు. అక్కినేని నాగేశ్వర రావు, నందమూరి తారక రామారావు ఇద్దరూ కళామతల్లికి రెండు కన్నులవంటి వారన్నారు.

ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు మహేష్‌బాబు, నమ్రతా శిరోద్కర్, రామ్ చరణ్, మోహన్ బాబు, ఎస్ఎస్ రాజమౌళి, ఎం.ఎం. కీరవాణి, అల్లు అరవింద్, అశ్వినీదత్, దిల్ రాజు, మురళీమోహన్, సుబ్బరామిరెడ్డి, నాని, మంచు విష్ణు, జగపతిబాబు, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జయసుధ, బ్రహ్మానందం, సి కళ్యాణ్, చినబాబు, నాగవంశీ, ఎస్ గోపాల్ రెడ్డి, వైవిఎస్ చౌదరి, జెమిని కిరణ్, గుణ్ణం గంగరాజు, అనుపమ్ ఖేర్, నాజర్ తదితరులు పాల్గొని అక్కినేని నాగేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించారు.

నాన్న విగ్రహాన్ని ఇప్పటికి చూడలేదు : నాగార్జున

"నాకు ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే .. 'ఆయన గొప్ప వ్యక్తి, ఇప్పుడు మనతో లేరు' అనే భావన కలుగుతుంది. చిన్నప్పటి నుంచి నా మనసులో ఇది ముద్రపడిపోయింది. విగ్రహం చూసినప్పుడల్లా నాకు అదే అనిపిస్తుంది. అందుకే నాన్న విగ్రహాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించే వరకూ నేను చూడలేదు" అని ఎఎన్నార్ తనయుడు అక్కినేని నాగార్జున అన్నారు. శిల్పి వినీత్ అద్భుతంగా విగ్రహాన్ని తీర్చిదిద్దారని అన్నారు.

'భ్రమర' షూటింగ్ ప్రారంభం



జిఎంకె ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నికితశ్రీ, పృథ్వీ రాజ్ (పెళ్లి), నాగమహేష్, జయవాణి, మీసాల లక్ష్మణ్, జబర్దస్త్ అప్పారావు, ఆకెళ్ళ, దువ్వాసి మోహన్, పసునూరి శ్రీనివాస్, మాణిక్యం, టార్జాన్ నటీనటులుగా టి.వి రవి నారాయణన్ దర్శకత్వంలో జి.మురళీకృష్ణ నిర్మాణ సారథ్యంలో భ్రమర సినిమా షూటింగ్ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సినీ ప్రముఖుల మధ్య షూటింగ్ ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా నిర్మాత బెక్కం వేణుగోపాల్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. తెలంగాణ ఎఫ్‌డిసి చైర్మన్ అనిల్ కూర్మచలం కెమెరా స్విచ్ఛాన్ చేశారు. నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం చిత్ర యూనిట్ ఏర్పాటుచేసిన పాత్రికేయులు సమావేశంలో హైకోర్ట్ న్యాయవాది సుంకర నరేష్ మాట్లాడారు. మంచి సందేశంతో వచ్చే భ్రమర సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

లవ్లీనా, హర్మన్‌ప్రీత్‌కు అరుదైన గౌరవం

- ప్రారంభోత్సవాల భారత బృందం ఫ్లాగ్ బేరర్లుగా అవకాశం
- 23నుంచి ఆసియా క్రీడలు





హాంగ్జు(చైనా): భారత పురుషుల హాకీజట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌లకు అరుదైన గౌరవం దక్కింది. 23 నుంచి చైనా వేదికగా జరిగే ఆసియా క్రీడల ప్రారంభోత్సవాల్లో భారత బృందానికి ముందు వీరు త్రివర్ణ పతకాన్ని చేబూని నడవనున్నారు. ఈమేరకు భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఎ) బుధవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇక భారత బృందానికి చెఫ్-డి-మిషన్ భూపేందర్ సింగ్ బజ్వా కంటింజెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం బజ్వా భారత రెజ్లింగ్ అసోసియేషన్ తాత్కాలిక ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయనతోపాటు మరో నలుగురు సభ్యులు ఆయనకు సహాయకులుగా ఐఓఎ నియమించింది. లవ్లీనా టోక్యో ఒలింపిక్స్ మహిళల బాక్సింగ్ 69కిలోల విభాగంలో కాంస్య పతకంతోపాటు న్యూఢిల్లీ వేదికగా జరిగిన ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 75కిలోల విభాగంలో స్వర్ణ పతకంతో సత్తా చాటింది. ఇక హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత పురుషుల హాకీ జట్టు టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి 40ఏళ్ల తర్వాత హాకీ క్రీడాంశంలో ఓ పతకాన్ని ఖాయం చేశాడు. భారత హాకీ జట్టు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధిస్తే 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించనుంది. జకార్తా వేదికగా జరిగిన 2018 ఆసియా క్రీడల ప్రారంభోత్సవంలో భారత బృందానికి స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సారథ్యం వహించారు. ఈసారి ఆసియా క్రీడల్లో భారత్ తరఫునుంచి మొత్తం 655మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించనున్నారు. గత ఆసియా క్రీడలతో పోల్చిచూస్తే.. భారత్ తరఫున ఇంతమంది ఈ పోటీల్లో పాల్గొనడం ఇదే ప్రథమం.

వాలీబాల్‌లో దక్షిణ కొరియాకు ఝలక్..

పురుషుల వాలీబాల్ జట్టు గ్రూప్-సిలో సంచలనం నమోదు చేసింది. ఆసియా క్రీడల్లో మూడుసార్లు స్వర్ణ పతకం సాధించిన దక్షిణ కొరియాపై 3-2తో సంచలన విజయం సాధించింది. తొలిరోజు కంబోడియాపై 3-0తో నెగ్గిన భారత్.. రెండో లీగ్ మ్యాచ్‌లో పటిష్ట దక్షిణ కొరియాకు ఝలక్ ఇచ్చి నాకౌట్‌కు చేరింది. బుధవారం జరిగిన హోరాహోరీ పోరులో భారత్ 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో విజయం సాధించింది.

హర్మన్‌ప్రీత్ సేన తొలి పోరు నేడే..

ఆసియా క్రీడల్లో తొలిసారి చోటు దక్కించుకున్న మహిళల క్రికెట్‌లో భారత జట్టు తొలి పరీక్షను గురువారం ఎదుర్కోనుంది. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో భారత మహిళల జట్టు మలేషియాతో తొలి గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో తలపడనుంది. ఈసారి ఆసియా క్రీడల్లో భారతజట్టు 100పతకాలు లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

సత్తా చాటిన సిరాజ్..

ఐసిసి వన్డే ర్యాకింగ్స్‌లో అగ్రస్థానం



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా వన్డే బౌలర్ల జాబితాలో హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ సత్తా చాటాడు. ఐసిసి విడుదల చేసిన వన్డే ర్యాకింగ్స్‌లో సిరాజ్ ఏకంగా ఎనిమిది స్థానాలను మెరుగుపరుచుకొని అగ్రస్థానానికి చేరుకున్నాడు. 694 రేటింగ్ పాయింట్లతో టాప్ వన్ బౌలర్‌గా నిలిచాడు. ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంకపై 21 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి కెరీర్ బెస్ట్ బౌలింగ్‌ను నమోదు చేయడంతో అతని ర్యాంక్ మెరుగైంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా బౌలర్ హేజిల్‌వుడ్‌ను వెనక్కి నెట్టాడు. తాజా వన్డే బౌలర్ల జాబితాలో హేజిల్‌వుడ్ 678 పాయింట్లతో రెండో స్థానంలో నిలువగా.. ట్రెంట్ బౌల్ట్(న్యూజిలాండ్) 677 పాయింట్లతో మూడోస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక వన్డే బ్యాటర్స్ జాబితాలో పాక్ కెప్టెన్ బాబర్ ఆజామ్ అగ్రస్థానంలో ఉండగా.. భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ రెండోస్థానంలో, విరాట్ కోహ్లీ ఎనిమిదో స్థానంలో, రోహిత్ శర్మ పదో స్థానంలో నిలిచి టాప్-10లో కొనసాగుతున్నారు.

అక్టోబర్ 5నుంచి జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో భారత ఆటగాళ్లు ధరించే కొత్త జెర్సీని బిసిసిఐ విడుదల చేసింది. అందులో టీమిండియా అధికారిక కిట్ స్పాన్సర్ అడిడాస్.. రెండు నిమిషాల నిడివి ఉన్న ప్రత్యేక గీతంతో కూడిన వీడియో ఉంది. ఈ వీడియోను బిసిసిఐ ట్విటర్‌లో బుధవారం పోస్ట్ చేసింది.





తొలిరోజు ఆధిక్యతలో ఉన్న మహ్మద్ సంజూ

అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత్‌తోపాటు బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, కెనడా, అండోర్రా దేశాల నుంచి 126 మంది ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన ప్రధాన టోర్నమెంట్ మొదటి రౌండ్‌లో 66 పాయింట్లతో కొల్‌కతాకు చెందిన మహ్మద్ సంజూ లీడ్‌లో ఉన్నారు. 67 పాయింట్లతో హరేంద్ర గుప్తా, అక్షయ శర్మ, రాజీవ్ కుమార్ జత్వాల్, అన్షుల్ పటేల్ రెండో స్థానంలో నిలిచారు. గురువారం రెండో రౌండ్ ఆట కొనసాగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68